సర్వజన ఆసుపత్రిలో గిరిజనుల వైద్యానికి ప్రత్యేక విభాగం ఏర్పాటుకు ప్రయత్నిస్తా

గిరిజన విద్యార్థుల వరుస మరణాలపై అధ్యయనానికి సిఫారసు

ఎస్.టి.కమిషన్ చైర్మన్ డా. డి.వి.జి.శంకరరావు

సాలూరు రోడ్డు ప్రమాద బాధితులకు పరామర్శ

విశాలాంధ్ర-విజయనగరం : వైద్యం కోసం గిరిజనులు చేరిన వెంటనే వారికి మెరుగైన సత్వర సేవలు అందించేందుకు వీలుగా స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఒక ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వానికి సూచిస్తానని రాష్ట్ర షెడ్యూల్డు తెగల కమిషన్ చైర్మన్ డా.డి.వి.జి.శంకరరావు చెప్పారు. ఈ సెల్ ఏర్పాటు ద్వారా ప్రత్యేక వైద్య(రెఫరల్) సేవలు పొందేందుకు వివిధ ప్రాంతాల నుంచి ఆసుపత్రికి వచ్చే గిరిజనులకు సత్వర వైద్యసేవలు అందడంతో పాటు వారికి అందించే వైద్యసేవలపై ప్రత్యేక శ్రద్ధ వహించే అవకాశం వుంటుందన్నారు. ఈ సెల్‌లో గిరిజనులు వివిధ వైద్య అవసరాలకోసం నమోదైనపుడు వారు ఎలాంటి వ్యాధులు, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారో తెలుసుకొని వాటిని నివారించడం కోసం ముందస్తు చర్యలు చేపట్టే అవకాశం కూడా ఏర్పడుతుందన్నారు. విశాఖపట్నంలోనూ, పార్వతీపురం ఆసుపత్రిలోనూ ఇటువంటి సెల్‌లు ఏర్పాటు చేశారని, వీటివల్ల మంచి ఫలితాలు వుంటున్నాయని చెప్పారు. సాలూరు మండలం విజయరాంపురం వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో పెళ్లి వ్యాన్ బోల్తాపడిన ఘటనలో గాయపడి స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తొమ్మిది మంది గిరిజనులను ఎస్.టి.కమిషన్ చైర్మన్ గురువారం పరామర్శించారు. చికిత్స పొందుతున్న గిరిజనుల వద్దకు వెళ్లి వారికి అందుతున్న వైద్య సహాయం గురించి తెలుసుకోవడంతోపాటు అక్కడి వైద్యులతో మాట్లాడి ప్రమాద బాధితులకు అత్యుత్తమ వైద్యసేవలు అందించాలని కోరారు. అనంతరం ఎస్.టి.కమిషన్ చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల మరణాలకు కారణాలను తెలుసుకొని వాటిని భవిష్యత్తులో పునరావృతం కాకుండా నివారించేందుకు వైద్య నిపుణులు, విద్యారంగ నిపుణులతో కమిటీ వేసి సమగ్ర అధ్యయనం జరిపించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరనున్నట్టు చెప్పారు. దీనివల్ల దీర్ఘకాలిక ఫలితాలు వుంటా యన్నారు. యీ పర్యటనలో ఆర్.ఎం.ఓ. డా.సురేష్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగం హెచ్.ఓ.డి. డా.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల స్థలాల కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి : సీపీఐ

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణం ఇందిరమ్మ కాలనీలో ప్రభుత్వ స్థలాలను నిబంధనలకు విరుద్ధంగా దర్జాగా కబ్జా చేస్తుంటే సంబంధిత రెవెన్యూ, మునిసిపల్ యంత్రాంగం తమకు ఏమీ తెలియనట్లు వ్యవహరించడం సిగ్గుచేటని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట. అప్పన్న, సిపిఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్ అన్నారు. ఇందిరమ్మ కాలనీలో జరుగుతున్న భూకబ్జాలపై గతంలో స్పందించిన రెవెన్యూ యంత్రాంగం ఏదైతే కబ్జాల గురయ్యాయో అటువంటి స్థలాలపై స్థలాలపై ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. వాటిని కొంతమంది భూకబ్జాదారులు అధికార పార్టీ నాయకులు పేర్లు చెప్పుకొని ఆ ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను పక్కనపెట్టి యధాతథంగా నిబంధనలకు విరుద్ధంగా ఇండ్ల అక్రమ కట్టడాలు చేపడుతున్నారని భూ కబ్జాదారులు బరితెగించి అధికార పార్టీ నాయకుల అండదండలతో జోరుగా కబ్జాకు పాల్పడుతున్నారని ప్రభుత్వ భూములు ప్రభుత్వ స్థలాలు ఆక్రమణ కాకుండా కాపాడు వలసిన రెవిన్యూ, మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే జిల్లా కలెక్టర్, బొబ్బిలి రెవెన్యూ డివిజనల్ అధికారి తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కే సత్యనారాయణ, హరి పాల్గొన్నారు.

సత్య కళాశాలలో ధ్యానం పై క్లాస్ నిర్వహణ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : స్థానిక తోటపాలెం లో గల సత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం ను పురస్కరించుకొని వివిధ కార్యక్రమాలను వారం రోజుల పాటు నిర్వహిస్తున్న తరుణం లో ధ్యానం పై క్లాస్ ను నిర్వహించటం జరిగింది. ఈ క్లాసు ను పిరమిడ్ ధ్యానంను గత 13 సంవత్సరాలుగా అనుసరిస్తున్న అశ్వినీ తీసుకున్నారు. ధ్యానం ఎలా చేయాలో మెళకువలు నేర్పించి విద్యార్థులతో ఒక 30 నిముషాలు ధ్యానం చేయించారు. ఇలా 21 రోజులు ప్రయత్నిస్తే ప్రశాంతంగా ధ్యానం చేయటం అలవాటు అవుతుందన్నారు. దీనివల్ల ముఖ్యంగా విద్యార్థులకు ఎంతో ప్రయోజనం ఉంటుందని వారు ఏది అనుకుంటే అది సాధించ గలరని అన్నారు. శ్వాస మీద ధ్యాసపెట్టడం ద్వారా మానవుడు ఎంతో ఉన్నతంగా తయారవుతాడన్నారు. కార్యక్రమంలో కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశి భూషణ రావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయిదేవ, పిరమిడ్ ధ్యాన అనుచరులు రామ కృష్ణ, మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రఘురాజుపై పుకార్లు.. షికార్లు

టీడీపీలో చేరుతారనే వార్త హల్‌చల్

విశాలాంధ్ర-జామి: ఎస్‌కోట నియోజకవర్గ వైసీపీలో రాజకీయాలు అనేక మలు పులు తిరుగుతున్నాయి. నియోజకవర్గంలో కీలకమైననేతగా,ఎమ్మెల్సీగా ఉన్న ఇందుకూరి రఘురాజుపై ప్రస్తుతం అనేక పుకార్లు.. షికారుచేస్తున్నాయి. వైసీపీలో బలమైననేతగా ప్రత్యేక వర్గంను నడుపుతున్న రఘురాజు త్వరలో టీడీపీలోకి చేరనున్నారనే వార్త ప్రస్తుతం నియోజకవర్గంలోనే కాక జిల్లాలోనే హాట్‌టాపిక్‌గా మారింది. ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న కడుబండి శ్రీనివాసరావును తీవ్రంగా వ్యతిరేకిస్తున్న రఘురాజు కడుబండికి టిక్కెట్ రాకుండా చేసేందుకు తీవ్రస్థాయి ఉద్యమమే చేసారు. అసంతృప్తి వర్గాన్ని అధిష్టానం వద్దకు పంపడంలో కృతకృత్యు లయ్యారు. కానీ అధిష్టానం ముఖ్యంగా జగన్ ఈవిషయంలో నేరుగా స్థానిక ఎమ్మెల్యే కడుబండితోపాటు టిక్కెట్ ఆశిస్తున్న నెక్కలినాయుడుబాబు, ఇందుకూరి రఘురాజును తాడేపల్లికి పిలిపించి ఈఎన్నికలు తన ఎన్నికలుగా భావించాలని నచ్చజెప్పి పంపించారు. కానీ అక్కడనుంచి వచ్చాక కూడా రఘురాజు వైఖరిలో మార్పు రాలేదు. ఇటీవల కాలంలో రఘురాజు పార్టీ మారుతారనే వార్తలు వచ్చినా కొద్దిరోజులుగా ఆయన టీడీపీలో చేరుతారనే వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. వివిధ పత్రికలలో సైతం కథనాలు వస్తున్నా ఆయన వాటిపై స్పందించక పోవడంతో ఈవార్తలు వాస్తవమనే విదంగా ప్రజలు నమ్ముతున్నారు. రఘురాజు పార్టీ మారితే వైసీపీకి వచ్చే నష్టాన్ని, టీడీపీకి కలిగే లాభాన్ని ఇప్పుడే అంచనా వేస్తున్నారు. ఈవార్తలు అసలు వాస్తవమో కాదో రఘురాజే తెలియజేయాలి. అంత వరకు ఈగాసిప్స్ వస్తునే ఉంటాయి.

'నిజం గెలవాలి' పర్యటనకు విచ్చేసిన నారా భువనేశ్వరిని కలిసిన మాజీ ఎమ్మెల్యే కోళ్ల

విశాలాంధ్ర-శృంగవరపుకోట: "నిజం గెలవాలి" పర్యటనలో భాగంగా నర్సీపట్నం విడిది కేంద్రంలో ఉన్న తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరిని, మాజీమంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడుని శృంగవరపుకోట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇంచార్జ్ కోళ్ల లలితకుమారి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

విశాలాంధ్ర-బాడంగి: ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాడంగి లో శుక్రవారం నుంచి ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధమని సి. హెచ్. శంకరరావు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి పరీక్ష ప్రారంభం అవుతుందన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించమన్నారు. సి.ఎస్.గా వి.శంకర రావు, డి.ఒ గా సి. హెచ్. అశోక్ కుమార్ లు పరీక్ష బాధ్యతలను నిర్వహించనున్నారు. మొదట రోజు 209 మంది పరీక్షా వ్రాయనున్నారన్నారు.

అవినీతి రహిత పాలన జగన్ తోనే సాధ్యం

ఎమ్మెల్యే అప్పలనరసయ్య

విశాలాంధ్ర-గజపతినగరం: అవినీతి రహిత పాలన సీఎం జగన్ తోనే సాధ్యపడు తుందని గజపతినగరం శాసనసభ్యులు అప్పల నరసయ్య అన్నారు గురువారం గజపతినగరం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గజపతినగరం దత్తిరాజేరు మండలాలకు చెందిన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు దేశంలో ఎక్కడా లేని విధంగా పెద్ద ఎత్తున పేదలందరికీ ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు ఒక రూపాయి కూడా లంచం తీసుకోకుండా నిష్పక్షపాతంగా పార్టీ కుల మత లు చూడకుండా ఇచ్చిన ఘనత జగన్మోహన్ రెడ్డి ది అని అన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ జ్ఞాన దీపిక పార్టీ నాయకులు బెల్లాన త్రినాధరావు కరణం ఆదినారాయణ మండల సురేష్ రేగ సురేష్ మండలంలోని సర్పంచులు గజపతినగరం దత్తిరాజేరు ఎంపీడీవోలు తాసిల్దారులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు నివారణ చర్యలు

నిక్షయ పోషణ యోజన పథకం ద్వారా నెలకు 500 పంపిణీ

విశాలాంధ్ర -మెరకముడిదాం : మండలం లో గల కొర్లాం నరసయ్యపేట పంచా యతీలను గురువారం జిల్లా క్షయ నివారణ అధికారిని టి రాణి సందర్శించారు. క్షయ వ్యాధి ముక్త పంచాయత్ కార్యక్రమంలో భాగంగా ఆమె ఈ రెండు పంచాయతీలలో గల క్షయ వ్యాధిగ్రస్తులను ఆమె సందర్శించారు. నిక్షయ పోషణ యోజన్ పథకం ద్వారా వ్యాధిగ్రస్తులకు నెలకు 500లు చొప్పున ఆరు నెలలకు గాను 3వేలు అందజేశారు. నరసయ్యపేటలో ప్రతి 1000 మందిలో 50 మందికి కఫం పరీక్షలు నిర్వహించారు. గుర్తించి టిబి వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారాన్ని ఆమె చేతుల మీదుగా అందజేశారు. గర్భాం ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి అనిల్ కుమార్ రెడ్డి ఆమెతోపాటు కొర్లాం పంచాయతీలో పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ పర్యవేక్షకులు నాగరాజు, కోఆర్డినేటర్ కుమార్, బాడంగి యూనిట్ రమేష్, సి హెచ్ ఓ తేజోర్మయి, సి హీచ్ ఓ ప్రశాంతి , రామలక్ష్మి ఏ న్ ఎం భాగ్యలత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బ్లడ్ బ్యాంకు, సీతం కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రభుత్వ బ్లడ్ బ్యాంకు, సీతం కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో సీతం, సత్య డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్.సి.సి., ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు 50 యూనిట్లను,మరో 50 యూనిట్లను కళాశాలల విద్యార్థులు రక్త దానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న రాష్ట్ర బాలల హక్కుల కమిషనర్ కేసలి అప్పారావు మాట్లాడుతూ రక్తదానం చేయండి ప్రాణదాతలుకండి అని పిలుపునిచ్చారు. ఒకటవ టౌన్ పోలీస్ స్టేషన్ సి.ఐ డాక్టర్ బి.వెంకటరావు మాట్లాడుతూ ప్రమాద సమయాల్లో రక్తం కొరత రాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జిశశి భూషణరావు రక్త దానం చేసిన ఎన్.సి.సి క్యాడెట్స్ మరియు విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో సీతం కళాశాల ప్రిన్సిపాల్ డా.డి.వి.రామమూర్తి, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్.టి.డి.వి.ఎ.నాయుడు, శ్రీమతి సి.హెచ్.వెంకటలక్ష్మి, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్.సతీష్ కుమార్ , ఎన్.సి సి అధికారులు లెఫ్టినెంట్ మజ్జి. వరలక్ష్మి కెప్టెన్ ఎమ్. సత్యవేణి, లెఫ్టినెంట్ ఎస్.ప్రశాంత్, కేర్ టేకర్ ఉదయ్ కిరణ్, సిఎస్ఓ కె.సత్యనారాయణ,డాక్టర్ శైలజ, కౌన్సిలర్ అప్పలనాయుడు, ల్యాబ్ సిబ్బంది మురళి, శేఖర్, లాల్ బి సిస్టర్, శారద, ప్రవీణ, ఎన్.సి.సి క్యాడెట్స్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ షిరిడి సాయి సేవా సమాజంలో ప్రత్యేక పూజా

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: జిల్లా కేంద్రం రింగ్ రోడ్డు లో ఉన్న శ్రీ షిరిడి సాయి సేవా సమాజం లో గురువారం తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.. ఆలయంలో శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి శివలింగ పునః ప్రాణ ప్రతిష్టి మహోత్సవం ఘనంగా జరిగింది.. ఆలయ ధర్మకర్త సేవా సమాజ అధ్యక్షులు కరణం జనార్ధన్ దంపతులు హోమం నిర్వహించారు.. అనతరం భక్తులకు తీర్ధ ప్రసాదాలు అందజేశారు.



రైతు దేశానికి వెన్నెముక : జేడీ వి.టి.రామారావు

విశాలాంధ్ర-నెల్లిమర్ల రూరల్: రైతు దేశానికి వెన్నెముక వంటివాడని ఆ రైతు సమృద్ధి సాధించిననాడే దేశం అభివృద్ధిపథంలో ముందంజలో ఉంటుందని వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ వి.టి.రామారావు అన్నారు. గురువారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తోన్న రైతు సమ్మేళనం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు మేలు రకాలైన వంగడాలతో పంటలు పండించడం, రసాయనాల వాడకం తగ్గించాలన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ శశిభూషణరావు మాట్లాడుతూ ప్రతి ఒకరు వ్యవసాయ అక్షరాస్యత కలిగి ఉండాలన్నారు. అగ్రికల్చర్ బీఎస్సీ చదివే విద్యార్థులు కేవలం ఉద్యోగాల కోసం కాకుండా అవసరమైతే స్వయం ఉపాధి కింద తీసుకోవాలన్నారు. బ్రెడ్స్ ఎన్జీవో సిఇఒ ఎ.రామకృష్ణంరాజు మాట్లాడుతూ సెంచూరియన్ సహకారంతో వ్యవసాయ ఉత్పత్తుల సంఘాలను (ఎఫ్.పి.ఒలు) బలోపేతం చేస్తామన్నారు. స్మార్ట్ అగ్రికల్చర్ స్కూల్ వల్ల జిల్లాకు విశేష ప్రయోజనాలు ఉన్నాయన్నారు. యాజమాన్య ప్రతినిధి ఎస్.రవీంద్ర మాట్లాడుతూ సెంచూరియన్ వ్యవసాయ రంగానికి విశేషకృషి చేస్తోందన్నారు. రైతులకు సాంకేతిక మెలకువలు తెలియజేసేందుకు సెంచూరియన్ అందుబాటులో ఉంటుందని ఐక్యూఎసి డీన్ ప్రొఫెసర్ పీఎస్వీ రమణారావు అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అగ్రి కల్చర్ స్కూల్ డీన్ డాక్టర్ పుష్పలత మాట్లాడుతూ రైతులు అధిక దిగుబడి సాధించడానికి అవసరమైన మెలకువలను అందించడంతోపాటు వారు సమృద్ధి సాధించడానికి అవసరమైన చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ రైతులకు ధృవపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు మధుసూదనరావు, ఐక్యూఎసి డీన్ ప్రొఫెసర్ పీఎస్వీ రమణారావు, డీన్ ప్రొఫెసర్.ఎల్.ఎన్.ఆచార్యులు, అసిస్టెంట్ డైరెక్టర్ మహరాజన్, పలువురు రైతులు పాల్గొన్నారు. ..

నేటి నుండి ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

విశాలాంధ్ర- పార్వతీపురం: ఇంటర్మీడియట్ పరీక్ష లు నేటినుంచి (శుక్రవారం) ప్రారంభం జరగను న్నాయని, దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జిల్లా అధికారులు తెలిపారు. ఇంటర్మీ డియట్ పరీక్షలు మార్చి 1నుండి 20వరకు ఉదయం 9గంటల నుండి మద్యాహ్నం 12 గంటల వరకు జరగనున్నాయని అధికారులు తెలిపారు.జిల్లాలో 32 కేంద్రాలలో పరీక్షలు జరుగుతుండగా మొదటి సంవత్సరం రెగ్యులర్ పరీక్షలకు 5,756 మంది, రెండవ సంవత్సరం పరీక్షలకు 5,700 మంది, సప్లమెంటరీ విభాగంలో 1744 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. పరీక్షా కేంద్రాలకు చీఫ్ సూపరింటిండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారుల నియామ కంతో పాటు, 2 సిట్టింగ్ స్క్వాడ్లు, 2 ఫ్లయింగ్ స్క్వాడ్ లను నియమించారు. పరీక్ష కేంద్రాల వద్ద పూర్తి బందోబస్తు ఏర్పాటుతో పాటు 144 సెక్షన్ ఉత్తర్వులను జారీ చేశారు. వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా బస్సులు నడపాలని ప్రజా రవాణా అధికారులను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. తాగు నీరు, విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండాలని ఇప్పటికే అదేశాలు జారీ చేశారు.

ప్రశాంతంగా పరీక్షలు రాయండి

ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ శుభాకాంక్షలు తెలపారు. ప్రశాంతంగా, ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని ఆయన అన్నారు. ప్రశాంతంగా రాస్తే మంచి మార్కులు వస్తాయని ఆయన సూచించారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా సంసిద్ధులు కావాలని జిల్లా కలెక్టర్ అన్నారు. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని ఆయన చెప్పారు.

విద్యార్థులకు మెనూ సక్రమంగా అందించాలి

శిక్షణ కలక్టర్ రాఘవేంద్ర

విశాలాంధ్ర - సీతంపేట: శ్రీకాకుళం జిల్లా శిక్షణ కలక్టర్ గా నియమితులైన రాఘవేంద్ర మీన గురువారం సీతంపేట, ఐటిడిఏలో పర్యటించారు. ఈ సందర్భంగా ఐటిడిఏ కార్యాలయంలోని పలు విభాగాలను పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీతంపేట బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. 9వ తరగతి విద్యార్థులు ట్యాబ్ ఉపయోగించే విధానాన్ని పరిశీలించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్ ను పరిశీలించి, పనితీరును ప్రశంసించారు. పది విద్యార్థులతో మాట్లాడుతూ త్వరలో రాయబోతున్న పబ్లిక్ పరీక్షలను బాగా రాయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో రోసిరెడ్డి, డీడీ అన్నాదొర, డిప్యూటీ డీఈవో లిల్లీరాణి, ఏటీడబ్ల్యువో మంగవేణి, ఏఎంవో కోటిబాబు పాల్గొన్నారు.

పాఠశాల విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే నిబంధనను సవరించాలి : యుటిఎఫ్

విశాలాంధ్ర-సీతానగరం: ప్రాథమిక విద్యావ్యవస్థలో చిన్నారులు ఒకటవ తరగతి లో చేరాలంటే ఆరేళ్ల వయసు ఉండాలని కేంద్రం తీసుకు వచ్చిన నిబంధనతో ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం అవుతాయని నిబంధనను వెంటనే సవరించాలని యుటిఎఫ్ మండల శాఖ డిమాండ్ చేసింది. స్థానిక ఎమ్మార్సీ ఆవరణలో మండల శాఖ ఒక ప్రకటన విడుదల చేస్తూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయుటకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్సాహం చూపుతుందని నూతన విద్యా విధానం, ప్రాథమిక పాఠశాల లను ఉన్నత పాఠశాలలలో విలీనం మొదలగు అంశాలతో ఇప్పటికే నిర్వీర్యమైన ప్రాథమిక పాఠశాల వ్యవస్థ ఈ నిబంధనతో పాఠశాలలు పూర్తిగా మూతపడే ప్రమాదం ఉందని ఈ నిబంధన ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిబంధనతో ప్రైవేటు పాఠశాలలకు లబ్ధి చేకూరుతుందని ప్రభుత్వ పాఠశాలలు పూర్తిగా మూతపడే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో మండలశాఖ అధ్యక్ష ,ప్రధానకార్యదర్శులు పి.శ్రీనివాసరావు, బి.ప్రసాదరావు గౌరవాధ్యక్షులు టీ.మధుసూదనరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. గోవిందరావు మండల కార్యవర్గ సభ్యులు బి. ఆదినారాయణ, కె. మురళిలు పాల్గొన్నారు.

98,991 మందికి పల్స్‌పోలియో

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.బగాది

విశాలాంధ్ర-బెలగాం/ పాలకొండ: పల్స్‌పోలియో కార్యక్రమంలో 98,991 మందికి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.బగాది జగన్నాథరావు తెలి పారు. పాలకొండ మండలం అన్నవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను గురువారం ఆకస్మికంగా సందర్శించి పల్స్ పోలియో కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. పోలియో వేక్సిన్, కోల్డ్ చైన్ సిస్టంను, వేక్సిన్ కేరియర్ లను తనిఖీ చేసారు. జిల్లాలో మొత్తం 42 మొబైల్ టీమ్‌లు, 19 ట్రాన్సిట్ టీమ్‌లు, 905 బూత్‌లు ఏర్పాటుచేశామన్నారు. ఐదు సంవత్సరాల లోపు వయస్సు గల 98,991 పిల్లలకు పోలియో చుక్కలువేయుటకు అన్ని చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రతీ ఆరోగ్య కేంద్రానికి సరిపడా వేక్సిన్, ప్రచార సామగ్రి, ఇతర సామగ్రి పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈనెల 3న పల్స్ పోలియో కార్యక్రమం జరుగుతుందని ఆయన అన్నారు. ఐదు సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లల తల్లితండ్రులు సమీపంలో ఉన్న పల్స్‌పోలియో కేంద్రంకు వెళ్ళి వేక్సిన్ వినియోగించుకోవాలని ఆయన అన్నారు. హైరిస్క్ ఏరియాపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.

ఆప్కాసులో డ్రైవర్లుగా గుర్తించాలి

కలక్టరుకు వినతిపత్రం అందించిన కార్మికులు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: పురపాలక సంఘ ప్రజారోగ్య విభాగంలో ఔట్సోర్సింగ్ ప్రాతిపదికన 15 సంవత్సరాలుగా డ్రైవర్లుగా విధులు నిర్వహిస్తున్న కార్మికులకు 279 జీవో ప్రకారంగా జీతాలు ఇవ్వాలని సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, మున్సిపల్ డ్రైవర్లు పి.గాంధీ, బి.సంతోష్ కుమార్, కె.వెంకటరావు, పి.వరదరాజు, ఎస్.శ్రీరాములు విజ్ఞప్తి చేశారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ నిశాంత్ కుమార్ కు సిఐటియు, మున్సిపల్ డ్రైవర్లు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పురపాలక సంఘంలో డ్రైవర్లుగా చేరినప్పటి నుండి 2018 జూన్ నెల వరకు మాత్రమే మా నైపుణ్యానికి తగ్గట్టు జీతాలు చెల్లించే వారని, ఆప్కాస్ 279 జీవో అమలు ద్వారా మాకు ఎటువంటి జీతాల పెంపుదల లేవని అన్నారు. ఈ సమస్యకే చాలాసార్లు సంబంధిత పై అధికారులకు విన్నవించుకున్న ఫలితం లేకుండా పోయిందని, పురపాలక సంఘ డ్రైవర్ల అందరిని పబ్లిక్ హెల్త్ వర్కర్లుగా గుర్తించిన అనంతరం రాష్ట్ర జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రాక తరువాత ఆప్కాస్ విధానం అమలులోకి వచ్చిందని, ఆ విధానంలో ప్రజారోగ్య విభాగంలో ఉన్న ఔట్సోర్సింగ్ డ్రైవర్ అన్న కూడా చేర్పించాలని ఉన్నప్పటికీ నేటికీ అటువంటి ప్రక్రియ మున్సిపాలిటీ సంబంధిత అధికారులు చేపట్టడం లేదని విన్నవించారు. ఈ విధానం అమలు రాష్ట్రవ్యాప్తంగా అనేక మున్సి పాలిటీల అమలు జరుగుతుందని, కేవలం మన్యం జిల్లా మున్సిపాలిటీలో మాత్రమే అమలులో లేదని తెలిపారు. నేటి పెరుగుతున్న ధరలు, ఆర్థిక పరిస్థితుల వల్ల చాలీచాలని వేతనంతో కుటుంబాన్ని పోషించడం చాలా కష్టంగా మారిందని అన్నారు. కావున గత 15 సంవత్సరాలుగా పురపాలక సంఘం ప్రజారోగ్య విభాగము నందు ఔట్సోర్సింగ్ గా పనిచేస్తున్న మమ్ములను ఆప్కాసులో డ్రైవర్లుగా నమోదు చేసి, మా నైపుణ్యానికి తగిన జీతాలను పెంచాలని కోరారు.

భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

భవన నిర్మాణ కార్మిక సంఘం డిమాండ్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డును సమర్ధవంతంగా నిర్వహించాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని,సంక్షేమ బోర్డు నిధులు 2000 కోట్లు సంక్షేమ బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం జమ చెయ్యాలని అర్హులైన భావన నిర్మాణ కార్మికులకు పెన్షన్ సౌకర్యం పెండింగ్ క్లైములు పరిష్కారం చేయాలని గుర్తింపు ఇప్పటికే సంక్షేమ బోర్డులో నమోదు చేసుకున్న భవన నిర్మాణ కార్మికులకు ఈ శ్రమ పోర్టల్ లో నమోదు చేసుకున్న కార్మికులకు విశ్వకర్మ యోజన అమలు చేయాలని భవన నిర్మాణ కార్మికులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగాఎపి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాయిపల్లి రాము దీక్షను ఉద్దేశించిమాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం,ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి భవన నిర్మాణ కార్మికులు సమస్యలు పరిష్కారం చేయడంలో, సంక్షేమ బోర్డును సమర్థవంతంగా నిర్వహించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. వై ఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డు ద్వారా భవన నిర్మాణ కార్మికులు కు అనేక సంక్షేమ పథకాల అమలుయ్యాయని జగన్మోహన్ రెడ్డి సంక్షేమం కోసం పని చేయాల్సిన ప్రభుత్వం ఆ పని చేయకుండా కార్మికులు చేస్ ద్వారా బోర్డులో ఉన్న 2000 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు దారి మళ్లించి మా కార్మికులు సంక్షేమానికి తూట్లు పొడిచిందన్నారు. సంక్షేమ బోర్డు ద్వారా అందాల్సిన సంక్షేమ కార్యక్ర మాలు అందకుండా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. మరో వైపు కరోనా కాలం నుంచి నేటి వరకు భవన నిర్మాణ కార్మికులు కు పనులు కల్పించడంలో ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిం చిందన్నారు. తమిళనాడు,కేరళ, ఇతర రాష్ట్రాల్లో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. మన రాష్ట్రంలో అమలు చేయకపోవడం దారుణమన్నారు. సంక్షేమ బోర్డు ను సమర్థ వంతంగా నిర్వహించాలని, ఉపాధి కి నష్టం చేసే మెమో 12,13 లను రద్దు చేయాలని,మా డబ్బులు 2000 కోట్లు బోర్డుకు జమ చేసి,సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సిఐటి కోసఅధికారి గొర్లి వెంకటరమణ. బంకుర్ సూరిబాబు. నాయకులు. రమేష్. అల్లం దుర్గారావు. %తీ% శంకర్రావు. కుప్పిలి అప్పారావు.ఈ వెంకటరమణ. వై వాసు. ఆనందు. లక్ష్మణరావు. తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల మరణాల నివారణకు చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-బెలగాం: పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని గిరిజన విద్యా సంస్థల్లో చదువుతున్న గిరిజన విద్యార్థుల మరణాల నివారణకు చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం, ఎస్ఎఫ్ఐ నాయకులు పి.రంజిత్ కుమార్, హెచ్. సింహాచలం డిమాండ్ చేసారు. ఈమేరకు పార్వతీపురం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వారం రోజుల్లో నలుగురు గిరిజన విద్యార్థులు మృతి చెందారని ఇంత జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు నివారణ చర్యలు చేపట్టడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్షణమే విద్యార్థుల మరణాల నివారణకు శాశ్వత, తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. మృతి చెందిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు 10 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని, గిరిజన ఆశ్రమ పాఠశాలలకు, కళాశాల వసతి గృహాలకు గతంలో పనిచేసిన"ఆదివాసీ ఆరోగ్య" సిబ్బందిని నియమించాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా"డైట్" చార్జీలు పెంచి పౌష్టికాహారం అందించాలని, సురక్షితమైన తాగునీరు, దోమ తెరలు అందించాలని, ఇతర మౌళిక సదుపాయాలు కల్పించి, అవసరమైనంతమంది కుక్, కమాటీ, వాచ్ మేన్ లను నియమించాలని విజ్ఞప్తి చేసారు. గిరిజన విద్యా సంస్థల్లో రెగ్యులర్ గా మెడికల్ చెకప్ లు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య సిబ్బంది నియామకం, నష్టపరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిస్తానని తెలిపారు. కార్యక్రమంలో గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.సంగం, గిరిజన విద్యార్థి సంఘ నాయకులు సిహెచ్ సీతారాం, గిరిజన అభ్యుదయ సంఘం నాయకులు ఎ. చంద్రశేఖర్, టిఆర్ఎఫ్ నాయకులు ఈ. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ముందుగా పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంపు

సూపరింటెండెంట్ ఇంజనీర్ లక్ష్మణరావు

విశాలాంధ్ర-సాలూరు రూరల్: మండలంలో దేవిబుచ్చిపేట సబ్‌స్టేషన్ లో ఉన్న 10/16 ఎంవిఏ సామర్థ్యం ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 31.5 ఎంవిఓ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ సూపరెంటెంట్ ఇంజనీర్ మువ్వల.లక్ష్మణరావు తెలిపారు.గురువారం దేవిబుచ్చమ్మ పేట గ్రామంలో ఉన్న 132/33 కెవి సబ్ స్టేషను లో తక్కువ సామర్థ్యం ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో అధిక సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు.వినియోగుదారుల సౌకర్యార్ధం సుమారు 5 కోట్ల వ్యయంతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామని ఎస్ఈ లక్ష్మణరావు తెలిపారు.దీనివలన సాలూరు,పాచిపెంట,మక్కువ మండలాల ఉపకేంద్రాలకు సరఫరా చేసే విద్యుత్ మరింత మెరుగ్గా అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు.రానున్నది వేసవికాలం కావున విద్యుత్ పై ఉన్న అధికలోడును సైతం తట్టుకొని సరఫరా చేసేందుకు ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఉపయోగపడుందని తెలిపారు.అధేవిధంగా రైతులకు అందించే విద్యుత్ లో కోతలేకుండా నాణగయమైన, మెరుగైన విద్యుత్ ను నిరాటంకంగా అందించేందుకు ట్రాన్స్ కో అధికారులు చేపట్టిన ఈ చర్య వలన అవకాశం ఉంటుందన్నారు.ఈ కార్యక్రమం లో ఏడి రంగారావు,మరియు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు విజ్ఞాన శాస్త్ర రంగంలో నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



విశాలాంధ్ర-గుమ్మలక్ష్మీపురం: విజ్ఞాన రంగంలో ఏరోజు కారోజు కొత్త కొత్త అన్వేషణ్లో వస్తున్న తరుణంలో విద్యార్థులు విజ్ఞాన శాస్త్ర రంగం అంశంపై జాగ్రత్తగా పరిశీలించుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులను ఉద్దేశించి డాక్టర్ ఎస్ శోభారాణి ఆర్జేడి రాజమహేం ద్రవరం అన్నారు. కళాశాలలో ఏర్పాటైన జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, కళాశాలకు హాజరై, విద్యార్థులు తయారుచేసిన ప్రయోగాలను పరిశీలించి విద్యార్థుల ప్రయోగాలకు పలు ప్రశ్నలు వేసి వారి వద్ద నుండి సమా ధానం రాబట్టి సంతృప్తి చెంది సలహాలు సూచనలు ఇచ్చారు. నేషనల్ సైన్స్ డే సందర్భంగా వివిధ పోటీలలో పాల్గొన్న విజేతలకు డాక్టర్ శోభారాణి, ప్రిన్సిపాల్ వరం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్జెడి ఆఫీస్ ఏవో మరియు అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయస్థాయి టెక్నికల్ సింబోజియం

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : జేఎన్‌టియు జివి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ విభాగంలో జాతీయస్థాయి టెక్నికల్ సింబోజియం గురువారం తో ముగిసింది. ఈ సి ఈ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూనివర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ జి జయసుమ హాజర య్యారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటువంటి టెక్నికల్ సింబో జియం ల వలన విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయన్నారు విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకునేందుకు విద్యార్థులంతా ఇటువంటి కార్యక్రమాల్లో హాజరు కావాలన్నారు. ప్రతి విద్యార్థి ఇటువంటి అవకాశాలను అనుకూలంగా మలుచుకొని ఉన్నత అవకాశాలు పొందాలన్నారు. ఈసీఈ విభాగం అధిపతి డాక్టర్ బి నలిని మాట్లా డుతూ వికీ విద్యార్థి ఇటువంటి టెక్నికల్ సింబోజియం లకు హాజరు కావడం వలన వారిలో ఉన్న నైపుణ్యాన్ని మరింత మెరుగు పరుచుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డాక్టర్ జి అప్పలనాయుడు, డాక్టర్ ఎం హేమ, డాక్టర్ జి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్.కోట వాసవి క్లబ్ వనిత ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలు పంపిణీ

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఎస్.కోటలోని సాయిబాబా ఆలయంలో ఎస్.కోట వాసవి క్లబ్ వనిత వారు పేదలకు నిత్యవసర సరుకులను గురువారం పంపిణీ చేసారు. వాసవి క్లబ్ వ్యవస్థలో సేవ అనేది ప్రధాన అంశమని, సమాజంలోని వివిధ వర్గాల వారికి సేవచేయడమే మా అంతిమ లక్ష్యం అని వనిత క్లబ్ ఎస్.కోట అధ్యక్షురాలు వాసవియన్ కందుకూరి కళ్యాణి అన్నారు. ఈ కార్యక్రమం వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ వారి ఆదేశాల మేరకు నాలుగు సంవత్సరాలకు వచ్చే ఒక లీప్ ఇయర్ రోజున సేవ చేయడమే మన కర్తవ్యం అన్నారు. ఇంటర్నేషనల్ ఇచ్చిన పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ వాసవియన్ సిల్వర్ స్టార్ కే సిజిఎఫ్ ఆదిమూలం రత్నావతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ రీజనల్ చైర్మన్ బాలనాగు శ్రీనివాస్, రీజనల్ సెక్రటరీ హరీష్‌కుమార్, వాసవి జిల్లా కోఆర్డినేటర్ కొల్లా పుష్పారాణి, వాసవి 214 జిల్లా క్యాబినెట్ జాయింట్ సెక్రటరీ వాసవి వంకదార సుశీల, వాసవి క్లబ్ మెగా సభ్యులు వాసవియన్ కందుకూరి ఈశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

ఆక్రమణలో రస్తా పోరంబోకు భూమి

- 16సెంట్ల భూమిలో షాపుల నిర్మాణానికి శ్రీకారం
- గ్రామ రెవెన్యూ అధికారి వద్దన్నా ఆగని పనులు
- అభ్యంతరం వ్యక్తం చేస్తున్న నల్లబిల్లి గ్రామస్థులు

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని నల్లబిల్లి రెవెన్యూ పరిధిలోని వావిలపాడు జంక్షన్ వద్ద సుమారు 16సెంట్ల ప్రభుత్వ రస్తా పోరంబోకు భూమిని అదే గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమించడమే కాకుండా షాపుల నిర్మాణానికి శ్రీకారం చుట్టాడు.సర్వే నెంబర్ 49/1లో సుమారు ఎకరా 8 సెంట్లు రస్తా పోరంబోకు భూమి ఉండగా అందులో కేడి రోడ్డుకు ఆనుకొని ఉన్న 16సెంట్ల స్థలాన్ని ఆక్రమించి షాపుల నిర్మాణానికి పూను కోవడంతో నల్లబిల్లి గ్రామస్థులు మండల తహశీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా గ్రామ రెవెన్యూ అధికారి తాతారావు ప్రభుత్వ భూమిని ఆక్రమించి షాపులు కట్టడం చట్ట విరుద్ధమని చెప్పి నిర్మాణ పనులు నిలిపివేశారు. అయినప్పటికీ గ్రామానికి చెందిన వైసీపీ నేత అండదండలతో మరలా షాపుల నిర్మాణానికి పూనుకున్నాడు. ఈ స్థలం మా జిరాయితి భూమికి ఆనుకొని ఉంది కావున అది మాకే చెందుతుంది మా ఇష్టం వచ్చినట్లు షాపులు నిర్మాణం చేస్తానన్నట్లు ఆక్రమణదారుడు తగ్గకుండా దౌర్జన్యంగా షాపులు నిర్మాణానికి పూనుకున్నాడు. అలాగే స్థానిక వైసీపీ నేత వీఆర్వో, వీఆర్ఏలపై తమ జులుం చూపిస్తున్నట్లు అధికారులు తెలుపుతున్నారు.

గ్రామరెవెన్యూ అధికారి వివరణ

నల్లబిల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 49/1లో గల భూమి రికార్డుల ప్రకారం రస్తా పోరంబోకు భూమి వాస్తవమే అయినప్పటికీ అదే గ్రామానికీ చెందిన దుబిరెడ్డి సూరిదేముడు అనే వ్యక్తి 16సెంట్ల స్థలాన్ని ఆక్రమించి షాపులు కడుతుండడం వాస్తవమేనన్నారు. షాపులు కట్టవద్దని వారించినా వినకపోవడంతో మండల తహశీల్దార్ దృష్టికి తీసుకువెళ్తున్నట్లు గ్రామ రెవెన్యూ అధికారి తాతారావు వివరణ ఇచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-శృంగవరపుకోట : ఎస్.కోట రూరల్ దొర్లపాలెం ఫీడరు పరిధిలో 11కేవీ విద్యుత్ లైన్ మెయింటనెన్స్ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కాపుసొంపురం, కొత్తపాలెం, గౌరీపురం, దబ్బగుంట, దారపర్తి, దుంగాడ, చినఖండేపల్లి, చీడిపాలెం, ముషిడిపల్లి, దొర్లపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఏఈ రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు స్నేహా సంస్థ ఘన సన్మానం

విశాలాంధ్ర-శృంగవరపుకోట: స్నేహ స్వచ్ఛంద సేవాసంస్థ ఎస్.కోటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో సంస్థ 13వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సంస్థ అధ్యక్షులు ఏఎస్ వెంకట్రావు అధ్యక్షతన వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన డాక్టర్ ఏ. ధరణి (వేపాడ), ఎస్.అప్పయ్యమ్మ (టీచర్), బి.లక్ష్మీ (డిగ్రీ కళాశాల లెక్చరర్)' బి.రాధారాణి (సిహెచ్‌ఓ ముసిడిపల్లి), జి.రుచిత (యోగా ఇన్స్ట్రక్టర్ సోంపురం), షేక్ తానీషా (కరాటే క్రీడాకారిణి) మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సోంపురం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు యోగా, షేక్ తానీషా కరాటే ప్రదర్శనలు చేశారు. కరాటే ప్రదర్శన చేసిన చిన్నారి తానీషాకి సంస్థ సభ్యులు ఎం.భాస్కరరావు 5116/- రూపాయలు ఆర్థిక సహకారం అందిస్తూ భవిష్యత్తులో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. దీంతోపాటుగా స్నేహ ప్రతిభ పరీక్షలో శృంగవరపుకోట మండలంలో గల 8 ప్రాథమికోన్నత పాఠశాలలు నందు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు, యోగా ప్రదర్శన చేసిన విద్యార్థులకు సన్మాన గ్రహీతల చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమాన్ని సంస్థ ఉపాధ్యక్షులు బుగత వెంకటేశ్వరరావు, కార్యదర్శి మంథా సుబ్బారావు ముందుండి నడిపించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు, పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సంస్థ శ్రేయోభిలాషులు, మిత్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

యువత కోటాలో అభ్యర్థిగా ఎంపికయ్యా

గజపతినగరం టిడిపి అసెంబ్లీ అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్

విశాలాంధ్ర-గజపతినగరం: యువత కోటాలో అసెంబ్లీ అభ్యర్థిగా ఎంపిక య్యాలని గజపతినగరం టిడిపి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు గురువారం ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో విలేకరులతో మాట్లాడుతూ నాడు దివంగత ఎన్టీఆర్ యువతకు ప్రాధాన్యత ఇవ్వగా నేడు చంద్రబాబు దాన్ని పాటించాలని చెప్పారు తాడేపల్లిగూడెంలో జరిగిన జనసేన టిడిపి సభ విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలియజేశారు అలాగే రాష్ట్ర భవిష్యత్తు కోసం జగన్మోహన్ రెడ్డి కోటను బద్దలు కొట్టాలని అన్నారు ఎంప్లాయిమెంట్ ఇచ్చి చెప్తాశుద్ధితో ప్రజలకు సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఈ ప్రభుత్వంలో మహిళలకు అభివృద్ధి లేదు ఖర్చులు ఎక్కువ అయ్యాయని అన్నారు ఇరు పార్టీలతో కలిసి కంబైన్డ్ గా యావత్ ప్రజానీకానికి యువతకు చేయూతనిస్తామని అన్నారు యువకులకు ప్రకటించిన 94 సీట్లలో 25% కొత్తవారికి ఇవ్వడం జరిగిందని అన్నారు తెలుగుదేశం పార్టీ లీడ్ చేయడానికి కచ్చితంగా బాధ్యత అని ప్రతి టిడిపి నాయకులు కార్యకర్తలు నడుము బిగించాలని వచ్చే ఎన్నికల్లో విజయం సాధించాలని కోరారు ఈ సమావేశంలో పార్టీ నాయకులు చప్ప చంద్రశేఖర్ గంట్యాడ శ్రీదేవి బొడ్డు రాము మీసాల జానకిరామ్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మారికలో నిర్మించ తలపెట్టిన ఆధాని పవర్ ప్లాంట్ ను అడ్డుకొని తీరుతాం

ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్ హెచ్చరిక

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని కరకవలస శివారు గిరిశికర గ్రామమైన మారిక గ్రామంలో గ్రీన్ పవర్ ప్లాంట్ నిర్మిస్తే ఊరుకునేది లేదని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చల్లా జగన్ హెచ్చరిస్తున్నారు. ఈ మెరకు గురువారం మారిక గిరిజన గ్రామంలో ఆధాని గ్రీన్ పవర్ ప్లాంట్ నిర్మానాన్ని వ్యతిరేస్తూ గిరిజనుల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మారిక గిరిజన గ్రామంలో గ్రీన్ పవర్‌ప్లాంట్ నిర్మిస్తే పచ్చనికొండలలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గిరిజన బ్రతుకులు సర్వనాశనం అవుతాయని అన్నారు. ఆదానీ మేనేజ్మెంట్ ప్రభుత్వ అండదండలతో పవర్ ప్లాంట్ నిర్మాణానికి సర్వేపనులు నిర్వహించడమే కాకుండా అక్కడ గాని పవర్ ప్లాంట్ నిర్మిస్తే పచ్చటి కొండలలో వ్యసాయం చేసుకుంటూ బతికే పాత మారిక, కొత్తమారిక గ్రామాలతో పాటు వ్యవసాయ భూమి మిగలవని గిరిజనుల బ్రతుకులు సర్వనాశనం చేసే ఆధాని హైడ్రో పవర్ ప్లాంట్ ను అడ్డుకొని తీరుతామని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యకులు చల్లా జగన్ హెచ్చరించారు. బుధవారం, గురువారం మారికలో పర్యటించిన అయన గిరిజన రైతులతో మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం తామరబ్బ, సమ్మెధ పంచాయతీల పరిధిలో రైవాడ రిజర్వాయర్ బ్యాక్ వాటర్ స్టోరేజ్ వద్ద శారద నదిపై అడ్డుకట్ట వేసి లిఫ్ట్ ద్వారా మారిక గేడ్డ మీదుగా కొండపైన ఉన్న మారికలో నీటిని నిల్వచేసి ఆ నీటిద్వారా మారికలో ఆధాని హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మించ తలపెట్టినందువలన పచ్చటి కొండలలో ఆధాని ప్రవేశంతో మారిక కొండపై గ్రామాలతో పాటు ఈ ప్రాంత ప్రజలు కూడా తిరగకుండానే ఆ గ్రామాలు ఆధాని పరమవు తాయాన్నారు. అలాగే రైవాడ రిజర్వాయర్ ఆధారంగాఉన్న రైతులకు ఇకపై నీరు ఉండదన్నారు.మారిక గెడ్డ ఆధారంగా వీలుపర్తి తూము చెరువుకి నీరు రాదని తెలిపారు ఇలా గిరుజనులను,రైతులను నట్టేట ముంచే ఆధాని గ్రీన్ హైడ్రో పవర్ ప్లాంట్ ను గిరిజనులు, రైతులను ఐక్యం చేసి అడ్డుకొని తీరుతామని, ఈ మేరకు పోరాటం ఉద్రతం కాకముందే పవర్ ప్లాంట్ ప్రతిపధాన వెనకకు తీసుకోవాలని జగన్ హెచ్చరించారు ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు కిల్లో ఆనంద్, గేమ్మెల రామకృష్ణ, బాబురావు, అప్పలనాయుడు, వెంకటరావు, ఆశు, కృష్ణ తదితరులు పాల్గొని నినాధాలు చేసారు.

భవనం నిర్మాణ కార్మికుల్ని ఆదుకునే పార్టీ కే మద్దతు

భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు గౌరీశంకర

విశాలాంధ్ర-కురుపాం: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్న పార్టీలకే రానున్న ఎన్నికల్లో ఓటు వేద్దామని భవన నిర్మాణ కార్మికుల సంఘ జిల్లా అధ్యక్షులు కె. గౌరీశ్వరరావు ,సిఐటియు నాయకులు కె .అవినాష్ పిలుపునిచ్చారు. గురువారం కురుపాం లో గల రావాడ జంక్షన్ బస్ షెల్టర్ లో భవన నిర్మాణ కార్మికుల నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ రాష్ట్రంలో 30 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులకు అమలవుతున్న సంక్షేమ పథకాలు ప్రభుత్వ ఆపివేయడం విడ్డూరంగా ఉందని ,భవన నిర్మాణ కార్మికుల ఓట్లు తమకు వద్దనుకున్నారో వారి నోట్లో మట్టి కొట్టిన తమకు ఓట్లు వేస్తారని ధీమాతో ఉన్నారో తెలియదు కాని పక్క రాష్ట్రం తెలంగాణలో ప్రమాద మరణానికి 6 లక్షలు, సహజ మరణానికి 2 లక్షలు, వివాహ కానుక, ప్రసవ కానుక, వృత్తిపరమైన పనిముట్లు తదితర సంక్షేమ పథకాల అమలు చేస్తున్నారని అటువంటి పథకాలనే మరోవైపు తమిళనాడు ,కర్ణాటక, కేరళతో సహా అన్ని రాష్ట్రాల్లో ఆ ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని మన రాష్ట్ర బిల్డింగ్ వర్కర్స్ హెల్పర్స్ బోర్డులో భవన నిర్మాణ కార్మికుల సంక్షం అనేది రెండు వేల కోట్ల రూపా యలు ఉన్న మన రాష్ట్ర ప్రభుత్వం కొత్త సంక్షేమ పథకాలు ప్రారంభించవలసింది పోయి ఉన్న పథకాలను ఆపేసిందని కావున భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలను గతం మాదిరిగా ప్రభుత్వం అమలుచేయాలని కోరుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఎం. రవికుమార్ ,ఎ.అరుణ, బి. ఈశ్వరరావు, జి.జన భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

ప్రజల బాగు కోసమే సచివాలయ వ్యవస్థ

విద్యాశాఖ మంత్రి బొత్స

విశాలాంధ్ర-గుర్ల: ప్రజల బాగోగులు చూడటానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారని, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ప్రజల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికి గ్రామంలోనే పదిమంది సచివాలయ కార్యదర్శులను అందుబాటులో ఉంచారని చెప్పారు. గుర్ల మండలం చింతపల్లిపేట, పాలవలసలో నిర్మించిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలను మంత్రి బొత్స సత్యనారాయణ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాలవలస ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ, గ్రామాల్లో ప్రజలకు వివిధ రకాల సేవలను అందించడానికి సుమారు 25 మంది ప్రభుత్వ సిబ్బంది, వాలంటీర్లు అందుబాటులో ఉంచారని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్ ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని పేర్కొన్నారు. రైతు సంక్షేమం కోసం, వ్యవసాయాన్ని సుభిక్షం చేసేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అవినీతి రహితంగా, పారదర్శకంగా పాలన అందిస్తున్న ఘనత ఆయనకే దక్కిందని కొనియాడారు. మంచి జరిగి ఉంటేనే తమకు అండగా నిలబడాలని ధైర్యంగా ప్రజలను అడగ గలిగే దమ్మున్న నాయకుడు జగన్ అని అన్నారు. ఎన్నికల ముందు ఏమి చెప్పారో..అవన్నీ చేసి చూపించారని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్ నమ్మకానికి ప్రతిరూపమని, ఇచ్చిన మాటకు కట్టుబడిన గొప్ప నాయకుడిని కొనియాడారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హయాంలో గ్రామాల స్వరూపాలు మారిపోయాయని అన్నారు. కోట్లాది రూపాయలతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు జరిగాయని చెప్పారు. పెద్ద ఎత్తున అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించడం జరిగిందని చెప్పారు.జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, పరిపాలన గ్రామ స్థాయిలో ప్రజలకు చేరడానికి సచివాలయ వ్యవస్థను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అన్నారు. విద్య, వైద్య రంగాల్లో ఎంతో ముందుకు వెళ్ళామని చెప్పారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు సచివాలయ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు యంత్రాంగం అందుబాటులో ఉందన్నారు. ఎంపి బెల్లాన చంద్ర శేఖర్ మాట్లాడుతూ, ఒక్క చింతపల్లి పేట గ్రామానికే వివిధ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల కోసం సుమారు రూ.14 కోట్లను ఖర్చు చేసినట్లు తెలిపారు. విద్యా రంగంలో అమలు చేసిన సంస్కరణలు, పథకాలను వివరించారు. రైతులను ఎన్నో విధాలుగా ఆదుకున్నారని చెప్పారు. నవరత్నాలు - పేదలందరికీ ఇల్లు కార్యక్రమంలో భాగంగా పేదలకు రిజిస్టర్డ్ పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో బి.శాంతి, ఎంపిపి ప్రమీల, సన్యాసినాయుడు, రాము,శ్రీను,జెడ్పీటీ సీర అప్పలనాయుడు, తహశీల్దార్ రమాదేవి, ఎంపీడీవో వెంకటరమణ, పార్టీ నాయకులు కేవి సూర్యనారాయణ రాజు, జమ్ము స్వామినాయుడు, బంగారునాయుడు, అప్పలనాయుడు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓంనమో శ్రీలక్ష్మినరసింహస్వామి అంటూ భక్తుల ముడుపుల పూజలు నిర్వహణ

విశాలాంధ్ర-సీతానగరం: మండలకేంద్రంలో శ్రీలక్ష్మినరసింహ స్వామి ఆలయంలో గురువారంనాడు ఓంనమో శ్రీలక్ష్మి నరసింహస్వామి, ఓం నమో నారాయణాయ, ఓం నమో శ్రీ వేణుగోపాలస్వామి అంటూ ముడుపుల పూజలకు వేకువ జాము నుండే భక్తులువివిధ ప్రాంతాలనుంచి పెద్దఎత్తున విచ్చేసి భక్తిశ్రద్ధలతో పూజలను నిర్వహించారు. ఆలయఅర్చకులు పీసపాటి శ్రీనివాసాచార్యులు, రామానుజాచార్యులు, కృష్ణామాచార్యులు, మురారీ తదితరులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు.గురువారంనాడు రకరకాల పూలతో అలంకరణతోపాటు గంధంతో అలంకరించిన తీరు అందరినీ ఆకట్టుకుంటుంది.ప్రతీగురువారం నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి నరసింహస్వామీ ముడుపుల పూజలకు దూరప్రాంతాలనుండి వాహనాలతో భక్తజనం పెద్దఎత్తున విచ్చేసి ఉపవాసం ఉండి భక్తి శ్రద్ధలతో పూజలను చేసి స్వామివారిని దర్శించుకుని, గోవింద గోవింద, జైశ్రీలక్ష్మినరసింహ, ఓం నమో నారాయణాయ అంటూ 27సార్లు ప్రదక్షిణలుచేయడం గమనార్హం. స్వామివారిని దర్శించుకున్న అనంతరం తీర్థప్రసాదాలను అందుకుంటున్నారు.

సూరమ్మపేట, ఇప్పలవలస పాఠశాలలను సందర్శించిన భామిని ఎంఈఓ

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని సూరమ్మపేట, ఇప్పలవలస పాఠశాలలను మన్యంజిల్లా భామిని మండలం ఎంఇఓ అధికారి శ్రీనివాసరావు గురువారం సందర్శన చేశారు.లిప్ కార్యక్రమం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు.పాఠశాల రికార్డులను, విధ్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సందర్శన చేసినట్లు తెలిపారు.ఆయనతో పాటు మండల విద్యాశాఖాధికారి-2 మువ్వల వెంకటరమణ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా మార్ట్ ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర

విశాలాంధ్ర-సాలూరు టౌన్ : మహిళలకు వెన్నుదన్నుండి నడిపిస్తూ ప్రతి విషయంలో వారికి ప్రాధాన్యత ఇస్తూ ప్రోత్సహిస్తూ ముందుకు తీసుకెళుతున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర కొనియాడారు. సాలూరు పట్టణంలో పురపాలక సంఘం పరిధిలో మీసేవ పాత భవనంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో జగనన్న మహిళ మార్ట్ ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమం ముఖ్య అతిథిగా ఉప ముఖ్యమంత్రి మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న దొర, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఎండి వి.విజయలక్ష్మి చేతుల మీదుగా మహిళా మార్ట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళల కొరకు అత్యంత తక్కువ ధరలకు దొరికే విధంగా ఈ మహిళా మార్ట్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. మహిళలకు ఈ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇచ్చే ప్రాధాన్యత ఏ రాష్ట్రంలో ఇవ్వలేదని ప్రతి ఒక్క విషయంలో వారికి ప్రోత్సహిస్తూ ముందుకు తీసుకుని వస్తూ వారికి స్వయం ఉపాధి కనిపిస్తున్న ఏకైక ప్రభుత్వం వైసిపి అని తెలియజేశారు. ఈ మహిళా మార్ట్ నకు 1156 పొదుపు సంఘాలు గ్రూపులు 12,622 మంది మహిళలు ఒకొక్కరు 150 రూపాయలు చొప్పున పెట్టుబడి పెట్టి 18,93,300 రూపాయలతో జగనన్న మహిళా మార్ట్ నిర్మించడం జరిగిందని తెలియజేశారు. ఎక్కువ ధరలు లేకుండా పరిమితమైన ధరలకు మాత్రమే మీకు ఇంటికి సరిపడా సరుకులు లభిస్తాయని అన్నారు.ఈ మార్ట్ దిగువ మధ్య తరగతి తరగతులకు కుటుంబాలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని ప్రతి ఒక్కరికి తెలిసే విధంగా ముందుకు తీసుకువెళ్లాలని మరింత అభివృద్ధి చెందేలాగా ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందించాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమము గౌరవ చైపర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్ చైపర్సన్ జరజాపు దీప్తి, వైస్ చైర్మన్ వంగపండు అప్పల నాయుడు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఏ ఆరోగ్య సమస్య వచ్చినా వైద్య సిబ్బందికి వెంటనే తెలియజేయాలి

విశాలాంధ్ర-బెలగాం: పార్వతీపురం మండలం రావికోన గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతిగృహం (హాస్టల్) ను జిల్లా మలేరియా అధికారి (డిఎంఓ) డాక్టర్ టి. జగన్ మోహనరావు గురువారం సందర్శించారు. విద్యార్థుల సిక్ రిజిష్టర్ ను తనిఖీ చేసి ఈ మధ్య కాలంలో జ్వర లక్షణాలతో నమోదు కాబడిన వివరాలు, నిర్ధారణ పరీక్షలు, వాటి నివేదికలు పరిశీలించారు. ఇతర ఆరోగ్య సమస్యలతో నమోదు కాబడిన వివరాలు, ఎక్కడ చికిత్స ఇస్తున్నారు, అందుకు సంబంధించిన ఓపి స్లిప్స్ పరిశీలించారు. సిక్‌రూంలో విద్యార్థులతో డాక్టర్ జగన్ మోహన రావు మాట్లాడి వారికి ఆరోగ్య పరిశీలన చేశారు. జ్వర లక్షణా లున్న విద్యార్థికి వైద్య సిబ్బందిచే నిర్ధారణ పరీక్ష చేయించారు. ప్రతీ రోజూ ఆరోగ్య పర్యవేక్షణ చేయాలని, వైద్య సిబ్బంది ఇచ్చిన మందులను దగ్గరుండి వేయించాలని హాస్టల్ నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులకు ఏ ఆరోగ్య సమ స్య వచ్చినా వైద్య సిబ్బందికి వెంటనే తెలియ జేయాల న్నారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. క్షేత్ర స్థాయి వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు హాస్టల్స్ ను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు చేపట్టాలన్నారు. అనంతరం ఆయన వంటగది, హాస్టల్ పరిసరాలు పరిశీలించి వాడుక నీరు నిల్వలేకుండా చూసుకోవాలని తద్వారా దోమల ప్రభావం ఉండదని అన్నారు. డార్మేటరీ కిటికీలకు మెస్ ల స్థితిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎఎంఒ సూర్యనారాయణ, హెచ్‌ఎం కె. సిమ్మన్నదొర, వార్డెన్ నరసింహులు, హెల్త్ అసిస్టెంట్ బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ ఆలయ శంఖుస్థాపన

విశాలాంధ్ర-జామి: మండలంలోని జాగరం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న శ్రీముత్యాలమ్మ అమ్మవారి ఆలయానికి గురువారం శంఖుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా ఈఆలయాన్ని నిర్మాణం చేయాలని గ్రామస్థులంతా కలిసి నిర్ణయించారు. ఈమేరకు జరిగిన శంఖుస్థాపన కార్యక్రమంలో మండలటీడీపీ మాజీ అధ్యక్షుడు రెడ్డిపైడిబాబు, తెలుగుయువత నాయకుడు రెడ్డి రాముతోపాటు వైకాపాకు చెందిన ఎంపిటిసి బి.నరసింహనాయుడు,నేతలు రాజు తదితరులు పాల్గొన్నారు. శంఖుస్థాపన అనంతరం పలువురు మాట్లాడుతూ ఆలయ నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు.

నిమిషం ఆలస్యమైన పరీక్షకు అనుమతించం : చీఫ్ సూపరింటెండెంట్లు

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని నేటినుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలలు ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చిన అనుమతిలేదని సీతానగరం, జోగమ్మపేట ఇంటర్ పరీక్షాకేంద్రాల చీఫ్ సూపరింటెండెంటులు దానరి త్రినాథ్, పోల వెంకటనాయుడులు తెలిపారు.జంబ్లింగ్ తరహాలో జరిగే ఈపరీక్షలకు అన్నిఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు. స్తానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సాదారణ కోర్సుల పరీక్షలతోపాటు వొకేషనల్ కోర్సుల విధ్యార్థులు కూడా పరీక్షలు రాయనున్నారు. ఇదిలాఉండగా రెండు పరీక్షాకేంద్రాలలో 144సెక్షన్ అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తహశీల్దార్ తెలిపారు. పరీక్షాకేంద్రాలవద్ద ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించడానికి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ ఎం రాజేష్ తెలిపారు.

గ్రామ స్వరాజ్యానికి సచివాలయాల వ్యవస్థ తీసుకొచ్చింది ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి

ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-లక్కవరపుకోట: గ్రామ స్వరాజ్యం కోసం సచివాలయాల వ్యవస్థ తీసుకొచ్చింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పోతంపేట గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను గురువారం ప్రారంభించిన సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువుగా ఉండేందుకు ప్రభుత్వ సేవలు పొందేందుకు గ్రామ సచివాలయాలు రైతు భరోసా కేంద్రాలు వంటి ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులో ఉండే విధంగా సచివాలయ వ్యవస్థను ముఖ్యమంత్రి తీసుకువచ్చారని నవరత్నాల్లో భాగంగా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల మేరకు డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేశారని, మహిళలకు ఆసరా పథకం కింద నగదు తమ ఖాతాలో జనం చేయడం జరిగిందని, విద్యార్థిని , విద్యార్థులు చదువుకొనుట కొరకు అమ్మ ఒడి పథకం కింద తల్లులు ఖాతాలోకి నగదు జమ చేయడం జరుగుతుందని అన్నారు. ప్రతి నెల ఒకటో తారీకు నాటికి వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, వివిధ రకాల పింఛన్దారులకు వాలంటీర్ల ద్వారా పింఛన్లు అందజేయడం జరుగుతుందని అన్నారు. రైతులు ఏ రకమైనటువంటి ఇబ్బందులు పడకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు పంపిణీ, ఎరువులు సకాలంలో అందజేయడమే కాకుండా రైతులకు ఎన్నో రకాల సేవలు అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు భూమిరెడ్డి సోమనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు గుమ్మడి సత్యనారాయణ, ఉప సర్పంచ్ ఎద్దు అక్కమ్మ, స్థల దాతలు ఎద్దు బాలకృష్ణ, పెద్ది రెడ్ల కిత్తన్న పాత్రుడు, పంచాయతీరాజ్ జేఈ జి వీరలక్ష్మి, ఎండిఓ కార్యాలయ పర్యవేక్షకులు ఎం వి ఏ దొర తదితరులు పార్టీ నాయకులు, కార్యకర్తలు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాజబంగారమ్మ ఆలయ పునఃప్రతిష్ఠ

విశాలాంధ్ర-నెల్లిమర్ల: నెల్లిమర్ల నగరపంచాయతీ పరిధి జరజాపుపేటలో రాజ బంగారమ్మ ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమం గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు, వైసిపి యూత్ వింగ్ జోనల్ ఇన్చార్జి అవనాపు విక్రమ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సురేష్ బాబు, అవనాపు విక్రమ్ మాట్లాడుతూ పురాతన ఆలయాన్ని తీర్చిదిద్ది పునః ప్రారంభించడం శుభపరిణామమని చెప్పారు. ఆలయ కమిటీకి అవనాపు విక్రమ్ రూ.20వేలు విరాళం అందించారు. కార్యక్రమంలో నెల్లిమర్ల నగరపంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు, నాయకులు అవనాపు విజయ భాస్కర్, సముద్రపు వెంకట రమణ, సముద్రపు సత్తిబాబు పాల్గొన్నారు.

'కెఆర్ హెల్పింగ్ హాండ్స్ 'ఆధ్వర్యంలో పది విద్యార్థులకు ఉచితంగా పరీక్షా కిట్లు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు మరియు కెఆర్ హెల్పింగ్ హాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బి కాంతారావు యాదవ్ ఆధ్వర్యంలో పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఉచితంగా పరీక్షా కిట్లను పంపిణీ చేయడం జరిగింది. కె ఆర్ హెల్పింగ్ హాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బి కాంతారావు యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి స్ఫూర్తి పొంది బడుగు బలహీన పేద వర్గాలకు నా వంతు ఆర్థిక చేయూత అందించాలని మరియు ప్రభుత్వ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు తన సహాయ సహకారాలు అందించాలని చారిటబుల్ ట్రస్ట్ స్థాపించడం జరిగిందన్నారు.భవిష్యత్తులో కూడా సేవా కార్యక్రమాలు ఈ ట్రస్ట్ తరఫున పెద్ద మొత్తంలో ఉంటాయని. విజయనగరం నియోజకవర్గ ప్రజలకు అన్ని విధాల చేదోడు వాదోడుగా ఆర్థిక రాజకీయ సామాజిక చైతన్య పరిచే క్రమంలో అన్ని సహకారాలు అందిస్తానని తెలియజేసుకుంటున్నాను అని చెప్పడం జరిగింది. ఉత్తరాంధ్ర బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు శ్రీ ముద్దద మధు మాట్లాడుతూ చాలా స్వచ్ఛంద సంస్థలు సామాజిక రాజకీయ ఆర్థిక అంశాలను పరిగణలోకి తీసుకొని వారి సేవలను కొనసాగించడం జరుగుతుందన్నారు కానీ చాలా కొద్ది సంస్థలు మాత్రమే విద్యార్థులు వాళ్ళ అవసరాలు వల్ల అభివృద్ధికి కావలసినటువంటి సహాయ సహకారాలు పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందని అటువంటి సంస్థ కె.ఆర్ హెల్పింగ్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్. చైర్మన్ శ్రీ బి కాంతారావు యాదవ్ రావు అనగారిన వర్గాల వారికి పేద బడుగు బలహీన వర్గాల వారికి అందిస్తున్న ప్రోత్సాహం విజయనగరం నియోజకవర్గ ప్రజలు ఎప్పటికీ మరిచిపోరన్నారు ఎందుకంటే సమాజంలో అన్ని వర్గాలు సమాన స్థాయిలో ఎదగాలని ప్రతి కుటుంబం కూడా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండాలని కోరుకుంటున్నా వ్యక్తి కాంతారావు అన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం సీరియల్ జానకిరామ్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు విద్యార్థుల మేధాసంపత్తి మీదే ఆధారపడి ఉంటుందని కాబట్టి స్వచ్ఛంద సంస్థలు కావచ్చు రాజకీయ నాయకులు కావచ్చు సామాజిక సేవ చేసే వ్యక్తులు కావచ్చు విద్యార్థుల అభివృద్ధికి సంబంధించినటువంటి ఇటువంటి కార్యక్రమాలు మరెన్నో చేయాలని కోరుకుంటున్నామన్నారు. పంపిణీ కార్యక్రమం అనంతరం కమిషన్ నెంబర్ కాంతారావు ను పాఠశాలలను యాజమాన్యం సిబ్బంది సన్మానించి సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అప్పలరాజు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొంచాడ రామకృష్ణ , హై స్కూల్ హెడ్మాస్టర్ కాంచన మేడం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం నాయకులు మేడూరినవీన్ దాస్ , అనిల్ గ, సీర నాయుడు , సతీష్ మొదలు వారు పాల్గొనడం జరిగింది.

జాతర కు ముస్తాబౌతున్న సంగమేశ్వరాలయం

విశాలాంధ్ర-వంగర : రాష్ట్రంలో పేరెన్నికగన్న దేవాలయాల్లో ఒకటైన సంగమేశ్వ రని వద్ద వారం రోజుల్లో జరగనున్న జాతర కు శివాలయం ముస్తా బౌతుంది. ఇక్కడ నవరాత్రులు ఇక్కడ ఎంతో ఘనంగా జాతర జరగ నున్న నేపథ్యంలో ఆలయానికి అన్నివిధాలుగా రూపు దిద్దుతున్నారు. ఆలయ కమిటీ వారు భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించటానికి అవసరమైన చర్యలు చేపట్టారు. అయితే శివుని దర్శనానికి వచ్చే భక్తులకు త్రివేణి సంగం నకు వెల్లే రహదారికి అవసరమైన చర్యలు తీసుకొని, భక్తులకు త్రివేణి సంగమం వద్ద కు వెల్లటానికి రహదారి ఉన్నప్పటికీ సక్రమంగా లేదు. ఆలయం వద్ద ప్రతీ ఏడాది జరిగే మహాశివరాత్రి జాతర కు రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు తండోప తండాలుగా తరలివస్తారు. భక్తులు వచ్చి ఇక్కడ గల సువర్ణ ముఖీ,వేఘావతి, నాగావళి నదులు సంగమేశ్వర ఆలయం వద్దనే కలుస్తాయి.ఈ మూడు నదులు కలిసే త్రివేణి సంగమం వద్దను స్నానాలు ఆచరించి అసంగమేశ్వరుని దర్శించుకొని,భక్తులు జాతరలో పాల్గొని వారికి అవసరమైన సామాగ్రిని తీసుకొని ఎంతో ఆనందం తో వారి, వారి గ్రామాలకు చేరుకొంటారు.

ఉచిత అంబులెన్స్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఉచిత అంబులెన్స్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని పట్టణంలోని సాయి ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ ఎ. శ్రీరామ్ మూర్తి విజ్ఞప్తి చేశారు. గురువారం విజయనగరం ఆస్పత్రిలో పార్వతీపురం జిల్లా వాసుల కోసం అంబులెన్స్ ప్రత్యేకంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీరామమూర్తి మాట్లాడుతూ పార్వతీపురం పట్టణంలో ఈ అంబులెన్స్ అందుబాటులో ఉంటుందని, బాధితులకు ఫోన్ చేసిన గంటలో అంబులెన్స్ చేరుకుంటుందని తెలిపారు. అత్యవసర వైద్యం కోసం ఈ అంబులెన్స్ సాయి ట్రస్ట్ ద్వారా ప్రజలకు అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సాయి ఆసుపత్రి డాక్టర్ సుధా మాధురి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బిటి రహదారికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శంకుస్థాపన

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: నగరంలోని 39వ డివిజన్ అలకానంద కాలనీలో నూతనంగా ఏర్పాటు చేయనున్న బిటి రహదారికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శంకుస్థాపన చేశారు. గురువారం ఆ ప్రాంతానికి చేరుకున్న ఆయనకు స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. తమ డివిజన్ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్న డిప్యూటీ స్పీకర్ కు స్థానికులు మహిళలు అభినందనలు తెలిపారు. శంకుస్థాపన కార్యక్రమం అనంతరం జోనల్ ఇన్చార్జి డాక్టర్ వి.ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ నగరంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నేతృత్వంలో అభివృద్ధి అంటే ఏంటో స్పష్టంగా చూపించారన్నారు. ఎన్నడూ లేనంత అభివృద్ధి సుందరీకరణ పనులు ఆశించిన దానికన్నా ఎక్కువగా జరిగాయన్నారు. చేసిన అభివృద్ధి పనులకు అభినందించాల్సింది పోయి ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ నేతలు విమర్శలు చేయడం విడ్డూరమన్నారు. ప్రతి డివిజన్లో ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా ఆయన చేసిన కృషి మరువరానిదన్నారు. ఇదంతా తమ డివిజన్ ప్రజల అదృష్టమని అన్నారు. స్థానిక కార్పొరేటర్ వింత ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఈరోజు 15 లక్షలతో బీటీ రహదారిని ఏర్పాటు చేయడం అలాగే కల్వర్టును కూడా నిర్మించడం సంతోషదాయకమన్నారు. ఇటువంటి శాసనసభ్యుడు ఏ నియోజకవర్గంలో ఉన్న ప్రజలందరూ అండగా నిలవాలని అన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి జరగాలంటే వీరభద్ర స్వామిలాంటి వ్యక్తులను గెలిపించుకోవాల్సిన అవసరం ప్రజలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, జోనల్ ఇంచార్జ్ కోలగట్ల తమన్న శెట్టి ,డిప్యూటీ మేయర్ లయాయాదవ్, కార్పొరేటర్ పిన్నింటి కళావతి తదితరులు పాల్గొన్నారు.

పశువులు అక్రమ రవాణా పై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : అనుమతులు, యన్.ఒ.సి లు లేకుండా పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని విజయనగం రెవెన్యూ డివిజన్ అధికారి సూర్య కళ అన్నారు గురువారం ఆమె ఛాంబర్ లో జంతుసంక్షేమ కమిటీ డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవిన్యూ డివిజనల్ అధికారి మాట్లాడుతూ అక్రమ రవాణాను అరికట్టడానికి మండలస్థాయి లో యస్.హెచ్.ఓ, తహశీల్దార్, యం.పి.డి.ఓ ఆధ్వర్యంలో ఉన్న కమిటీలను పటిష్టపరచి పర్యవేక్షం చేయడం జరుగుతుందన్నారు. ప్రతీ మండలంలో తహసీల్దార్ అధ్యక్షతన మండల జంతు సంక్షేమ కమిటీలు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. దేవాదయాలకు 300మీటర్లు వరకు ఎటువంటి జంతు బలులు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. డివిజనల్ జంతు సంక్షేమ కమిటీలో నూతన కమిటీ సభ్యులను ఎంపిక చేసి పశువదలు జరగకుండా చూస్తామన్నారు. గోమాత చిత్ర పటంతో కూడిన క్యాలెండర్లను ఆమె ఆవిష్కరించారు.ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమైక్య రాష్ట్ర అధ్యక్షులు జీవబందు లోగిశ రామకృష్ణ మాట్లాడుతూ పశువులు సంతల్లో కనీస మౌళిక సదుపాయాలు సి.సి కెమెరాలు లేకుండానే సంతకు లైసెన్స్ లు ఇస్తున్న అధికారులు పై చర్యలు తీసుకోవాలన్నారు. వీది కుక్కలను హింసాత్మాకంగా చంపకుండా యానిమల్ బర్త్ కంట్రోల్ యాక్ట్ ప్రకారంగా వాటి సంతతిని నిరోదించాలన్నారు. కలెక్టరెట్ ఎదురుగా గోవులను చంపి విదేశాలకు ఎగుమతి చేస్తున్న మాఫియా పై చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో విజయనగరం పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ వై.వి రమణ, రెవిన్యూ డివిజనల్ కార్యాలయం సుపరేండెంట్ హరి కిరణ్, రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ముదిలి శ్రీనివాసరావు, జిల్లా విద్యాశాఖ సూపరేండెంట్ యస్. సాంబశివరావు, డివిజనల్ పంచాయతీ అధికారి పట్నాయుకుని గోవర్ధన్ రావు, విజయనగరం మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా'కె. సాంబమూర్తి, వెహికల్ ఇన్స్పెక్టర్ ఐశ్వర్య లక్ష్మి, డివిజనల్ జంతు సంక్షేమ కమిటి బోర్డు డైరెక్టర్స్ చోళ్ళ రాజకుమారి, కెవిర్ సత్యనారాయణ, పాంద్రంకి. సంతోష్ కుమార్, నీలాపు దేవి, వర్రి సంతోషి, ఎద్దు. మనోహర్, కరక వెంకటరమణ, గార పవన్ కుమార్, నడిపేనా సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

108 సిబ్బందికి ప్రత్యేక శిక్షణ

విశాలాంధ్ర-రాజాం : విజయనగరం జిల్లా రాజాం ప్రాంతీయ ఆసుపత్రి ఆవరణలో 108 సిబ్బందికి గత 2 రొజులుగా శిక్షణ తరగతులు నిర్వహించాటం జరిగింది.వివరాలలోకి వెళితే ఏ ఈ ఎం ఎస్ 108 సంస్థ లో పనిచేస్తున్న 108 ఈఎంటి సిబ్బందికి నూతన విధానాలకు అనుగుణంగా జిల్లా ఏ ఈ ఎం ఎస్ మేనేజర్ నాజీర్ హుస్సన్ సమక్షం లో విజయనగరం ,బొబ్బిలి, చీపురుపల్లి డివిజన్ ఓఈ రవి కుమార్,ఉపేంద్ర,సాయిసణ్ముఖ్ పర్యవేక్షణలో ఓ జే టి అలుబిల్లి శ్రీనివాసరావు ఆధునిక పద్ధతి లో బేసిక్ లైఫ్ సపోర్ట్ సీపీయర్ చేసే విధానం అలాగే శరీరంలో వివిధరకాల వ్యవస్థ లు అంతర నిర్మాణం, పని చేసే విధానం రక్షణ చెయడం ఎలా మొదలగు అంశాలు గురించిన్ శిక్షణ, తరగతులు నిర్వహించారు.ఈ తరగతులకు డివిజన్ నుండి 65 మంది ఈఎంటి లు హాజరయ్యి శిక్షణ పొందారు.

అక్రమ మద్యంతో పట్టుబడిన వ్యక్తిపై కేసు

విశాలాంధ్ర-భోగాపురం : అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు భోగాపురం సి ఐ రవికుమార్ తెలిపారు. మండలంలో రావాడ గ్రామానికి చెందిన బుత్తల ఉగాది 16 మద్యం క్వార్టర్ బాటిల్స్ ను బెల్టు షాపు నిర్వహించడానికి అక్రమంగా తరలిస్తుండగా గురువారం రావాడ గ్రామ పొలిమేరలో పోలీసులకు పట్టుబడ్డాడని, అతని వద్ద మద్యం బాటిల్స్ ను సీజ్ చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయడమైనదని పేర్కొన్నారు.

శ్రీచైతన్య పాఠశాలలో బాల మేధావుల అద్భుత ఆవిష్కరణలు

విశాలాంధ్ర-బెలగాం: పట్టణంలో గల శ్రీచైతన్య పాఠశాలలో బాల మేధావుల అద్భుత ఆవిష్కరణలు జరిపారు. ఫిబ్రవరి 28 సర్ సి.వి రామన్ శాస్త్ర విజయానికి సూచికగా ప్రతీ యేటా నిర్వహించే సైన్స్ ఎక్సపో లో భాగంగా చిన్నారుల బాల మేధాశక్తితో రూపొందించిన నూతన ఆవిష్కరణలు ఆద్యాంతం చూపర్లను కట్టిపడేశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన పార్వతీపురం మండల విద్యాధికారి కె. ప్రసాద్ చిన్నారుల ఆలోచనల ఆవిష్కరణలు చూసి ఆనందం వ్యక్తం చేసి వీళ్ళే రేపటి తరం శాస్త్రవేత్తలుగా రాణిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మరో విశిష్ట అతిధిగా విచ్చేసిన పార్వతీపురం ఎంఈఓ సింహాచలం పిల్లల ప్రతిభా పాటవాలను మెచ్చుకొని ఆశీర్వాదించారు. శ్రీచైతన్య ప్రాంతీయ అధికారి వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ నేటి యుగంలో విజ్ఞానానికి ఉన్న ఆదరణ అంతా ఇంతా కాదు, మనిషి సృష్టికి ప్రతి సృష్టి చేస్తున్న రోజులివి. కావున మా విద్యార్థులను ఎప్పటికప్పుడు సాంకేతిక అభివృద్ధిలో పోటీపడేటట్లు తీర్చిదిద్దడానికి మా యాజమాన్యం, మా ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తూనే ఉంటారని తెలియజేశారు. ప్రిన్సిపాల్ బి. జగదీష్ విద్యార్థుల ప్రతిభకు, వారి శ్రమకు గీటురాయిగా వారు రూపొందించిన ప్రాజెక్ట్స్ మచ్చు తునకగా అభివర్ణించారు. డీన్ సుదర్శన్ ఈ పోటీ ప్రపంచంలో విజేతగా నిలవాలంటే మనల్ని మనం ఎప్పటికప్పుడు మలుచుకోవాలని, ప్రపంచం నీవైపు చూసేలా సరిదిద్దుకోవాలని మార్గ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సి. బ్యాచ్ ఇంచార్జ్ రవికుమార్, ఎఒ రామకృష్ణ, టెన్త్ ఇంచార్జ్ మహేష్, ప్రైమరీ ఇంచార్జ్ సంధ్యా, ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ శ్రీలత, సైన్స్ విభాగ ఉపాధ్యాయులు రామకృష్ణ, కొండలరావు, అప్పలనాయుడు, కిరణ్, లక్ష్మీ, అనూష, రజని ఇతర ఉపాధ్యాయ, ఉపాద్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుండి ఇంటర్మీడియట్ పరీక్షలు

విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి

ఆర్ఐఓ మజ్జి ఆదినారాయణ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ ఇంటర్మీడియట్ పరీక్షలో నేటి నుండి ప్రారంభం కానున్నాయి. శుక్రవారంనుండి ప్రారంభం కానున్న ఈ పరీక్షలు 20వ తేదీ వరకు జరగనున్నాయి అన్ని పరీక్షా కేంద్రాలలో నిఘా నీడలో పరీక్షలు నిర్వహించేందుకు ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారులు సర్వం సిద్ధం చేశారు పరీక్ష కేంద్రాల్లో అన్ని గదుల్లో సీసీ కెమెరాలను అమర్చారు జిల్లాలో మొత్తం 45,755 మంది విద్యార్థులు పరీక్షలు రాయమన్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 20,630 కాగా నితీ సంవత్సరం విద్యార్థులు 25, 125 మంది ఉన్నారు. జిల్లాలో మొత్తం 73 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని అన్ని పరీక్షా కేంద్రాల్లో మౌలిక వస్తువులు కల్పనకు ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు ఆర్ ఐ ఓ మజ్జి ఆదినారాయణ తెలిపారు 73 మంది చీఫ్ సూపర్డెంట్లు, 73 మంది డిపార్మెంట్ అధికారులు రెగ్యులర్ అధ్యాపకులు లైబ్రేరియన్ లో ఫిజికల్ డైరెక్టర్లు నియమించారు దాదాపుగా 1200 మంది ప్రభుత్వ టీచర్లను నియమించారు. ప్రతి విద్యార్థి అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకోవాలని విద్యార్థులు ఎవరు తమతోపాటు ఎటువంటి ఎలక్ట్రికల్ వస్తువులు తీసుకురావద్దని ఆర్ ఐ ఓ మజ్జి ఆదినారాయణ తెలిపారు విద్యార్థులు ఎటువంటి మానసిక ఒత్తులకు గురికాకుండా పరీక్షలు రాయాలన్నారు.

ఆర్టీసి లో విలీనం కు ముందు రిటైర్ కాబోతున్న ఉద్యోగులకు ఆర్ఇయంయస్ స్కీమ్‌కు అంగీకారం

ఆర్టీసి ఇ.యు రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి

విశాలాంధ్ర-పాలకొండ: ఏపియస్ ఆర్టీసి ని ప్రభుత్వంలో 2020 లో ప్రభుత్వంలో విలీనం చేసిన తరువాత అంతవరకు ఆర్టీసి ఉద్యోగులకు విలినం కు ముందున్నటు వంటి కొన్ని అలవెన్సులు, ఇన్‌సెంటివ్ స్కీమ్సును, అలాగే ప్రధానంగా వైద్య సౌకర్యాలు పాతపద్ధతిలో లేకుండా రద్దుచేయడమే చేసారు. అంతేకాక రిటైర్ కాబోతున్న ఉద్యోగి తదనంతరం ఉద్యోగి భార్యభర్త లకు ఆర్టీసి ఆసుపత్రులలో ట్రీట్ మెంటు మందులు సప్లయితో పాటు రిఫరల్ ఆసుపత్రులలోను చికిత్సలు చేసు కొనేందుకు వీలుగా ఉన్న రిటైర్డు ఎంప్లాయీస్ మెడికల్ స్కీమ్ (ఆర్.ఇ.యం.యస్)రద్దుచేసారు.మళ్లి ఆస్కీమ్ ను ఏపిపిటిడి (ఆర్టీసి)ఎంప్లాయీస్ యూనియన్ చేసిన కృషి మేరకు ఆర్టీసి యం.డి సహకారంతో మళ్లీ కొనసాగించేందుకు అంగీకరింప జేసామని,దీనికి ప్రభుత్వం ఆమోదం కూడా లభించింది. ఈ ఆర్.ఇ.యం.యస్ స్కీమ్ కావల్సిన ఉద్యోగులు క్లాస్ 3/4 ఉద్యోగులు రూ. 30వేలు, సూపర్ వైజర్సు & అధికారులు రూ:40,000 రిటైర్ అవుతున్నప్పుడు ఏకమొత్తంలో ఈ డబ్బులు చెల్లిస్తే ఆ ఉద్యోగి భార్యభర్తలకు జీవితాంతం ఆర్టీసి ఆసుపత్రులలో ట్రీట్‌మెంటు తో పాటు మందులు సప్లయి చేస్తారు,అలాగే రెగ్యూలర్ ఉద్యోగుల మాదిరిగా ఇ.హెచ్.యస్ ద్వారా కూడా వీరికి ట్రీట్ మెంటు అందించేలా అంగీకారం కుది రిందని ఇందుకు సంబందించి ఆదేశాలు త్వరలో రాబోతున్నాయని ఏపిపిటిడి (ఆర్టీసి)ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు తెలిపారు. గురువారం పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలో సాయి కళ్యాణమండపింలో పాలకొండ డిపో ఎంప్లాయీస్ యూనియన్ కమిటి గురువారం ఏర్పాటుచేసిన ఉద్యోగ విరమణ చేస్తున్న ఇ.యు నాయకులు బి.జి.రావు,కె.కె.రావు,యం.లింగమూర్తి కి సన్మాన కార్యక్రమాన్ని డిపోకమిటి ఆధ్వర్యంలో డిపో అధ్యక్షులు సాగర్,కార్యదర్శి యల్.డి.నాయుడు అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ ఓవర్‌టైమ్ డ్యూటీ (ఓటి)అలవెన్సులను జీతంతో చెల్లింపులు జరిగేలా ఇ.యు రాష్ట్రకమిటి కృషిమేరకు ప్రస్తుతం చెల్లింపులు జరుగుతున్నాయి. ఇంకా గతంలో పెండింగు పెట్టి న 46 రోజుల ఓటి డబ్బులు లను కూడా చెల్లింపులు జరిపేందుకు కృషిచేస్తున్నామని తెలిపారు. అంతే కాకుండా గత 20 నెలలుగా జీతంలో కలిపి చెల్లించాల్సిన నైట్ హాల్టు డ్యూటీలు అలవెన్సులు కూడా ఈనెలనుండి జీతంతో పాటే చెల్లింపులు జరుగుతున్నాయంటే ఇది ఇ.యు చేసిన కృషి ఫలితమేనని,త్వరలో పెండింగు పెట్టిన 20 నెలలు నైట్ హాల్టు అలవెన్సులు అరియర్సుకూడా ఇప్పిస్తామని దామోదరరావు హామి ఇచ్చారు. అంతేకాకుండా కండక్టర్లు, డ్రైవర్లు,మెంటినెన్సు సిబ్బందికి విలీనం కు ముందు ఉండి ఇప్పుడు తొలగించిన కొన్ని ఇన్సెంటివ్ స్కీమ్సును,మహిళా కండక్టర్లకు ప్రతినెలా ఇచ్చే హెల్తు అలవెన్సును రూ:200 లు, మెంటినెన్సు సిబ్బందికి ఇచ్చే టెక్నికల్ అలవెన్సు రూ:200 తొలగించిన వాటిని సాధించు కొనేందుకు ఆర్టిసి యం.డి శ్రీ.ద్వారకా తిరుమలరావు సహకారంతో ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్రకమిటిగా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న మరో ముఖ్యఅతిధి విజయనగరం జోన్ జోనల్ కార్యదర్శి బాసూరి కృష్ణమూర్తి మాట్లాడుతూ ఆర్టీసీ అధికారులు కొంత మంది ఇష్టానుసారంగా పనిష్ మెంట్లు ఇస్తున్నారని అందరికీ సమాన న్యాయం జరగడంలేదన్న అభిప్రాయంతో 2019 లో ఇ.యు గుర్తింపు కాలంలోనే ఉద్యోగబద్ర ఉండేలా సర్క్యులర్ నెం: 01/2019 ఇప్పించామని,కాని ఇప్పుడు కొంతమంది అధికారులు ఈ సర్క్యులర్ ను పక్కన పెట్టి సస్పెండ్లు,రిమూవల్సు చేస్తున్నారు. దీనిని తీవ్రంగా ఇ.యు తరుపున వ్యతిరేకిస్తూ ఆర్టిసి యం.డి లేఖ కూడా ఇవ్వడమైనది దీనిపై చర్చలు రాష్ట్రకమిటిగా జరుపుతుందని తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఇ.యు మణ్యం జిల్లా కార్యదార్శి సుందరరావు, వర్కింగు ప్రెసిడెంటు దుమ్మెద దుర్గారావు మాట్లాడుతూ రాష్ట్రకమిటి కృషిమేరకు అన్నికేటగిరుల ఉద్యోగులకు లామినేటెడ్ గుర్తింపు కార్డులు ఐదు సంవత్సరాలకు ఒకసారి రెన్యూవల్ చేసుకొనేలా ఇవ్వబోతున్నారని ఇందుకు సంబందించి ఆదేశాలు కూడా యం.డి గారు జారీచేసారని తెలిపారు. ఈసమావేశంలో పాలకొండ డిపో ఇ.యు అధ్యక్ష,కార్యదర్శులు పాల్గొన్నారు.అధిక సంఖ్యలో ఆర్టీసి ఉద్యోగులు పాల్గోన్నారు.

మానవత్వం తో అనాధకు ఆపన్న హస్తం

విశాలాంధ్ర-బొబ్బిలి : మానవత్వం తో ఓ అనాధకు ఆపన్నహస్తం అందించి వైద్యానికి, ఆరోగ్యానికి బరోసాకల్పించారు కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జె సి రాజు మాస్టారు. ఆమె పేరు పుల్కో దేవి(65) ఒరిస్సా నుండి బతుకు దెరువు కోసం బొబ్బిలి వచ్చి నెమలి పింఛాలు అమ్ముకుంటు నోబుల్ పాఠశాల ఎదురుగా నిర్మాణములో ఉన్న భవనంలో తలదాచుకుంటున్నది. నిన్న రైల్వేస్టేషన్ జంక్షన్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాల పాలయ్యింది. క్షతగాత్రురాలను కింతల వాని పేటకు చెందిన కిషోర్ అనే యువకుడు మరికొందరి సహాయంతో బొబ్బిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు తక్షణమే స్పందించి ఎడమ కాలుకి 7 కుట్లు గెడ్డం కు రెండు కుట్లు వేశారు. పై దవడ లో 3 పళ్ళు ఊడి పోయాయి. వైద్యులు చికిత్స అందించి పంపించి వేశారు. ఈ విషయాన్ని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జెసి రాజు మాస్టారికి తెలియచేసి అనాథను ఆదుకొని ఆరోగ్యం మెరుగు పడేందుకు ,పోషణకు సహకారం అందించవలసినదిగా కిషోర్ అనే యువకుడు కోరడంతో వెంటనేమానవత్వం తో స్పందించిన జెసి రాజు గురువారం ఆమెను పరామర్శించి పోషణకు, వైద్య ఖర్చులకు కొంత మొత్తాన్ని ఆమెకు అందించటం తో పాటు మెరుగైన వైద్యం కొరకు స్థానిక ఎన్నారై ఆస్పత్రి యాజమాన్యంతో మాట్లాడి వైద్య సహాయం అందిస్తామని ఆమెకు భరోసా కల్పించు ఆపన్న హస్తాన్ని అందించారు.

వైసిపి పాలన నచ్చక టిడిపి పార్టీ లో చేరిక

విజయనగరం నియోజకవర్గ టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి పూసపాటి అదితి

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ : వైసిపి అరాచక పాలన నచ్చక సుమారు 50 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారని విజయనగరం నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. గురువారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. విజయనగరం కార్పొరేషన్ 5,7 డివిజన్లు మరియు రీమా పేట పంచాయితీ నుండి సుమారు 50 కుటుంబాలు వైసీపీని వీడి టిడిపి లో చేరారన్నారు. టిడిపిలో చేరికల్ని ఆపేందుకు వైసిపి నాయకులు ఎన్నో భయభ్రాంతులకు గురిచేసిన భయపడకుండా ప్రజలు తెలుగుదేశం పార్టీలో చేరడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వైసిపి పాలనలో అభివృద్ధి జరగలేదన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే సంక్షేమం తో పాటు అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. అందుకోసం టిడిపి శ్రేణులు, జనసైనికులు కలిసికట్టుగా పని చేయాలన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు నిండిన స్త్రీకి నెలకి 1500 , తల్లికి వందనం పథకం కింద మీ ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ఒక్కొక్కరికి ఏడాదికి 15000, దీపం పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం, యువ గళం నిధి కింద ప్రతి నిరుద్యోగి నెల కి 3000, నిరుద్యోగ యువతకి 20 లక్షలు ఉద్యోగ కల్పన వంటి పథకాలు అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారన్నారు. అందుకోసం రానున్న ఎన్నికల్లో విజయనగరం నియోజకవర్గంలో నన్ను గెలిపించి రాష్ట్రంలో నారా చంద్రబాబునాయుడుని మరలా ముఖ్యమంత్రి చేయాలని కోరారు. అనంతరం పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ప్రసాద్ లక్ష్మీ వరప్రసాద్, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆల్తి బంగారు రాజు, నాయకులు ఐవిపి రాజు, రాజేష్ బాబు కంది మురళి నాయుడు, ఈగల సత్యారావు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

6 బ్లడ్ డోనార్ కుర్చీలు అందజేత



విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ వారికి నావూరు విజయనగరం సేవా సంస్థ అధ్యక్షురాలు గుమ్మాలూరి విశాలాక్షి 6 బ్లడ్ డోనార్ కుర్చీలు సామాజిక సేవా కార్యకర్త 4 ఎస్. రాజు , జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కేఆర్డి ప్రసాద్ రావు చేతులు మీదుగా అంద జేయడం జరిగింది. సామజిక సేవా దృక్పథంతో ఇలాంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయమని రెడ్ క్రాస్ చైర్మన్ అభినందించారు. సామాజిక సేవా కార్యక్రమాలకు నా ఊరు విజయనగరం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు జి. విశాలాక్షి ఎప్పుడూ ముందుంటుందని 4 ఎస్ రాజు అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి కె. సత్యం. రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది. తదితరులు పాల్గోన్నారు.

సోంపురం జెడ్పి పాఠశాల స్కౌట్ విద్యార్థుల యోగా ప్రదర్శన

విశాలాంధ్ర-వేపాడ : శృంగవరపు కోట స్నేహ ఫౌండేషన్ వారి వార్షికోత్సవ సభలో సోంపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల స్కౌట్స్ ఇతర విద్యార్థుల చేపట్టిన యోగా ప్రదర్శన సూపరులను ఎంతగానో ఆ కట్టుకున్నాయి. పాఠశాల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీపీఏ రాజు, పాఠశాల యోగ టీచర్ రుచిత సెక్షన్ లో తర్ఫీదు పొందిన విద్యార్థులు పాఠశాల ఇన్చార్జిలు ఎం శ్రీనివాసరావు రవిశంకర్ ల పర్యవేక్షణలో హ్యూమన్ ఆల్ఫాబెట్స్ సంఘటిత పిరమిడ్ యోగ ప్రదర్శన ఆహుతులచే ఆకట్టుకుంది. ఈ విద్యార్థులకు సంస్థవారు ప్రశంసా పత్రాలు జ్ఞాపకలు, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఇటీవల సంస్థ వారిచే నిర్వహించబడిన ప్రతిభా పరీక్షలో మొదటి మూడు స్థానాలను సిద్ధార్థ, దిలీఫ్, చంద్రశేఖర్ లను యోగా ఇన్స్ట్రక్టర్ రు చిత విద్యార్థులను సన్మానించారు. మారుమూల గ్రామాలైన కు గుర్తింపు తెచ్చి పెట్టారని వారిని అభినందించారు.

3న శ్రీసాయికృష్ణ ఆసుపత్రి సారధ్యంలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఎస్.కోట పట్టణంలోని శ్రీసాయికృష్ణ ఆసుపత్రిలో (ఆరోగ్య శ్రీ హాస్పిటల్) ఈనెల 3వ తేదీన ఆదివారం ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ ఆర్.త్రినాథరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో మెడనొప్పి, నడుమునొప్పి, ఆర్థరైటిస్, మోకాళ్ళ నొప్పులతో బాధపడేవారు వైద్య పరీక్షలు చేయించుకోవలసినదిగా కోరారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో వైద్యులు డాక్టర్ ఆర్.త్రినాథరావు, డాక్టర్ ఆర్.రామ్ కార్తీక్, డాక్టర్ ఆర్.మౌనిక, డాక్టర్ ఎస్.ఫణిశ్రీ, డాక్టర్ జి.కిరణ్ కుమార్ తదితరులు రోగులకు పరీక్షలు నిర్వహిస్తారని, ఇతర వివరాలకు 08966293144 నెంబరు ని సంప్రదించవచ్చని త్రినాథరావు పేర్కొన్నారు.

సూర్యారావు సేవలు అభినందనీయం : డిపిఆర్ఓ రమేష్

విశాలాంధ్ర -పార్వతీపురం: ఉద్యోగి విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపు నిస్తాయని, సూర్యారావు సేవలు అభినందనీయమని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్ అన్నారు. జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహించి పదవీవి రమణచేసిన ఇ.సూర్యారావుకు గురువారం సన్మానించారు. పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఆయన మాట్లాడుతూ సర్వీసులో చేరినప్రతీఒక్క ఉద్యోగికి బదిలీలు, పదవీ విరమణ సాధారణమన్నారు. పనితనంతో ప్రదర్శించిన సేవలే చిర స్థాయిగా నిలుస్తాయని పేర్కొన్నారు. క్రమ శిక్షణతో విధుల్లో ఆయన చూపిన నిబద్ధత, అంకిత భావం అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అధికారుల పట్ల వినయ విధేయతలతో మెలిగేవారని కొనియాడారు. సహోద్యోగుల బెనిఫిట్స్ సకాలంలో అందేవిధంగా ఆయన చూపిన చొరవ స్ఫూర్తిదాయకమని అన్నారు. శేష జీవితంలో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి చేతుల మీదుగా జ్ఞాపికను అందజేశారు. ఈకార్యక్రమంలో ఎస్.టి.ఓ పి గణేష్ బాబు, సహాయ కార్యనిర్వాహక సమాచార ఇంజినీర్ ఎమ్.గజపతిరావు, సహాయ ఇంజినీర్ సిహెచ్.శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ సుజాత సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాజాం టౌన్ లో టీడీపీ-జనసేన కూటమికి భారీ షాక్

విశాలాంధ్ర-రాజాం : రాజాం నియోజకవర్గం వైఎస్సార్సీపీ ఇంఛార్జ్, ఎమ్మెల్యే అభ్యర్థి డా. తలే.రాజేష్ ఆధ్వర్యంలో రాజాం నియోజకవర్గం టీడీపి-జనసేన కూటమి నుంచి వైసీపీ లోకి వలసలు జోరు అందుకున్నాయి. ఈ రోజు రాజాం టౌన్ 20వ వార్డ్ హరిజన వీధికి చెందిన సిఖ.దిలీప్, టోంపల అవినాష్, కూన నరేష్, గొకవలన ప్రశాంత్, నర్వసిద్ధి దివాకర్, విష్ణుపాత్రుని. దుర్గా ప్రసాద్, తలచింతల.గణేష్, గొండేల. తేజ, గొండేల పవన్, ఈర్ల భవాని, బొద్దేపల్లి. ఈశ్వర రావు మరియు మరో 135 కుటుంబాలు వైఎస్సార్సీపీ పార్టీ లో చేరడం జరిగింది. వీళ్లకు డాక్టర్. తలే రాజేష్ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు కండువాలు వేసి సాధారంగా ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టౌన్ వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి : కోలగట్ల

విశాలాంధ్ర -విజయనగరం టౌన్: తాము చేస్తున్న అభివృద్ధి, అందుబాటుతనం వల్లనే తమ పార్టీలోకి వలసలు పెరుగుతున్నాయని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. గురువారం బొబ్బాది పేటలో మాజీ కౌన్సిలర్లు బొబ్బాది త్రినాధరావు, బొబ్బాది విజయలక్ష్మి, కర్రోతు అప్పారావు, సీతంనాయుడు తదితరులు కోలగట్ల సమక్షంలో వైసిపి తీర్థాన్ని పుచ్చుకున్నారు. వారికి పార్టీ కండువాలు వేసిన కోలగట్ల వీరభద్రస్వామి పార్టీ లోకి సాదరంగా ఆహ్వానించి, ప్రత్యేక అభినందనలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా కృషి చేయాలని చెప్పారు. రానున్న ఎన్నికలలో విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోలగట్ల సూచించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన నమావేశంలో కార్యకర్తలు, ప్రజలను ఉద్దేశించి కోలగట్ల మాట్లాడారు. ఎన్నోఏళ్ళుగా తెలుగుదేశం పార్టీలో ఉంటూ సేవలం దించిన మాజీ కౌన్సిలర్లు బొబ్బాది త్రినాధరావు, బొబ్బాది విజయలక్ష్మితో పాటు మరి కొంతమంది వైసిపి లో చేరడం శుభపరిణామం అన్నారు. ప్రజలు ఇచ్చిన అధికారంతో అనునిత్యం ప్రజల కోసమే పరితపిస్తూ వారి కష్టసుఖాలలో భాగస్వామ్యం అయ్యానని అన్నారు. కరోనా వంటి కష్ట కాలంలో కూడా ప్రజలకు అండగా నిలిచామన్నారు. అన్ని ప్రాంతాలలో మౌలిక వసతులను కల్పించి ప్రజలకు చేరువయ్యామన్నారు. మరీ ముఖ్యంగా ప్రతిక్షణం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి అవసరాలను తీర్చగలుగుతున్నామని చెప్పారు. అందువలనే పార్టీకి మరింత బలం చేకూరు తుందని అన్నారు. బీసీ కాలనీ ఉడా కాలనీ బొబ్బాది పేట ప్రాంతాలలో తెలుగుదేశం పార్టీకి బలమైన వ్యక్తిగా ఉన్న త్రినాధరావు కుటుంబం తమ పార్టీలోకి రావడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది అన్నారు. రానున్న ఎన్నికలలో మరోసారి తనకు అవకాశం ఇచ్చినట్లయితే నగరాన్ని సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. వైసీపీలో చేరిన బొబ్బాది త్రినాధరావు మాట్లాడుతూ నగరంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఆకర్షితుడి నయ్యానని అన్నారు .కోలగట్ల వీరభద్ర స్వామి సమక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరానని అన్నారు. తనతో పాటు కుటుంబ సభ్యులు ఇతర ముఖ్య నాయకులు కూడా వైసిపి తీర్థం పుచ్చుకున్నారన్నారు. కోలగట్ల గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని మాట ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేయరు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయ యాదవ్,జోనల్ ఇన్చార్జ్ డాక్టర్ వి.ఎస్ ప్రసాద్, స్థానిక కార్పొరేటర్ తొగురోతు సంధ్యారాణి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, వైసిపి నాయకులు నారాయణ అప్పుడు రమణ పాల్గొన్నారు.